12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 322 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా శనివారం 26 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 322 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : Dr. B.R. AMBEDKAR KONASEMA DIST SAT 26 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,Thadepalligudem,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## గంగమ్మ ఒడికి
## ఖైరతాబాద్ మహాగణపతి..
### ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం



- హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి
- 69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం
- క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం
- పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుక

హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు.

- మిగతా 2లో





### బడా గణేశ్ శోభాయాత్ర: పోలీసులతో కలిసి స్టెప్పులేసిన దానం నాగేందర్

- ఖైరతాబాద్ గణేశ్ శోభాయాత్రలో డ్యాన్స్ చేసిన దానం నాగేందర్
- మహిళా కానిస్టేబుళ్లతో కలిసి స్టెప్పులేసిన వైనం
- 'ప్యారడైజ్' సినిమా పాటకు డ్యాన్స్ చేసి ఉత్సాహం పంచారు
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో
- బడా గణేశ్ నిమజ్జన వేడుకల్లో చోటుచేసుకున్న ఘటన





## పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి లోకేశ్
## అహ్మదాబాద్ పర్యటన

- టోరెంట్, వెల్ స్పన్, ఆస్టల్.. అహ్మదాబాద్‌లో రెండో రోజు కూడా నారా లోకేశ్ బిజీబిజీ
- అహ్మదాబాద్ పర్యటనలో పారిశ్రామిక దిగ్గజాలతో మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు
- క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం ఏపీని ఎంచుకోవాలని టోరెంట్ గ్రూప్‌కు పిలుపు
- విశాఖలో టైర్ల తయారీ, డేటా సెంటర్ల ఏర్పాటుపై పలు సంస్థలతో కీలక చర్చలు
- కాకినాడ, నెల్లూరులలో ఇండస్ట్రియల్ పార్కులు, రిఫైనరీలు స్థాపించాలని విజ్ఞప్తి
- లోకేశ్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని సానుకూలంగా స్పందించిన కంపెనీలు

పెన్ పవర్ డెస్క్:ఏపీకి పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ విస్తృత పర్యటనలు కొనసాగిస్తున్నారు. గుజరాత్ లోని అహ్మదాబాద్ టూర్‌లో భాగంగా రెండో రోజైన శుక్రవారం ఆయన పలు పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా ఏడు ప్రముఖ సంస్థల అధిపతులు, ప్రతినిధులతో చర్చలు జరిపారు. క్లీన్ ఎనర్జీ, ఫార్మా, టెక్స్‌టైల్స్, మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్లు,

- మిగతా 2లో

## ఏపీ హోంగార్డులకు శుభవార్త.. కానిస్టేబుల్
## ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్

- ఏపీలోని హోంగార్డులకు ప్రభుత్వం శుభవార్త
- కానిస్టేబుల్ డ్రైవర్ పోస్టుల నియామకాల్లో 10 శాతం రిజర్వేషన్
- ప్రభుత్వ పాత ఉత్తర్వులను సవరిస్తూ కొత్త జీవో జారీ
- పోలీస్ రవాణా విభాగంలో 198 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

- మిగతా 2లో

## ఏపీలో వర్ష బీభత్సం.. అధికారులకు మంత్రి
## అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు

- తీవ్ర వాయుగుండం వల్ల రాష్ట్రంలో పంట నష్టంపై తక్షణ అంచనాకు ఆదేశం
- పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు సూచన
- ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మంత్రి అచ్చెన్నాయుడు టెలీకాన్ఫరెన్స్
- పొలాల్లోని నీటిని తొలగిస్తూనే, భవిష్యత్తు కోసం నిల్వ చేయాలని దిశానిర్దేశం
- రైతులకు సాంకేతిక సలహాలు అందించి అండగా నిలవాలని స్పష్టం



పెన్ పవర్ డెస్క్:తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల జరిగిన పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయాలని అధికారులను ఆదేశించినట్టు ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. దెబ్బతిన్న రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేసినట్టు ఆయన వెల్లడించారు.

- మిగతా 2లో

## మహిళలను పారిశ్రామికవేత్తలుగా
## తీర్చిదిద్దడమే లక్ష్యం

- విజయవాడలో తొలిసారి నేషనల్ సరస్ ప్రదర్శన
- ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- మహిళా సంఘాల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, వారి ఆర్థిక సాధికారతను పెంపొందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. విజయవాడలో తొలిసారిగా నిర్వహిస్తున్న 'నేషనల్

- మిగతా 2లో

### ఎన్నికల సంఘంలో విభేదాలు అంటూ కథనం..
## ఆందోళన వ్యక్తం చేసిన జగన్

- ప్రస్తుత నియామక చట్టాన్ని సవరించాలని కేంద్రానికి డిమాండ్
- ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా కమిటీలో ఉండాలన్న జగన్
- ఈసీలో కమిషనర్ల అభ్యంతరాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సూచన
- ఏపీలో గతంలో తమ అభ్యంతరాలను పట్టించుకోలేదని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)లో అంతర్గత విభేదాలు ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనం రావడం, దేశవ్యాప్తంగా ప్రకంపనలు రేగడంపై వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం జగన్ స్పందించారు.

- మిగతా 2లో



## సీఈసీ రాజీనామాకు డిమాండ్.. దేశవ్యాప్తంగా నిరసనలు..




### ఓట్ల దొంగలను వదిలిపెట్టమంటూ నినాదాలు

పెన్ పవర్ డెస్క్:కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఓట్ల దొంగ, దేశద్రోహి,

- మిగతా 2లో

## స్టాలిన్ గారూ, ఈ కేసుపై నోరు విప్పండి



### సీఎం విజయ్ ఆగ్రహం

- వీరమణి లైంగిక వేధింపుల కేసుపై నోరు విప్పాలన్న విజయ్
- డీఎంకే హయాంలోనే కేసును తొక్కిపెట్టారని తీవ్ర ఆరోపణలు
- ఈ విషయంలో డీఎంకే, ఏఐఏడీఎంకే కుమ్మక్కయ్యాయని విమర్శ
- ఉప ఎన్నికల ప్రచారంలో స్టాలిన్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేసిన సీఎం విజయ్

- మిగతా 2లో

## 'బ్రహ్మోస్'తో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు

పెన్ పవర్ డెస్క్: ఉత్తర్‌ప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులతో దాయాది పాకిస్థాన్ నిద్రలేని రాత్రులు గడుపుతోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. అమేఠీలో తయారవుతున్న ఏకే-203 రైఫిళ్లు మావోయిస్టులు, ఉగ్రవాదులను బెంబేలెత్తిస్తున్నాయని వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు శత్రు స్థావరాలను



- మిగతా 2లో

## సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కేకు..
## ఢిల్లీ హైకోర్టు నోటీసులు

పెన్ పవర్ డెస్క్:జంతర్ మంతర్ నిరసనల్లో ఓ మహిళ ఫొటోల ప్రదర్శనపై ఢిల్లీ హైకోర్టు సీజేపీ ప్రతినిధులకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే తోపాటు సౌరభ్ దాస్, అశుతోష్ రాంకా,




- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

### ఎన్నికల సంఘంలో విభేదాలు అంటూ కథనం..
## ఆందోళన వ్యక్తం చేసిన జగన్

- మొదటి పేజి తరువాయి

ఈసీ పనితీరు, నియామకాల పద్ధతిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం నిలబడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం ఉద్దేశించిన 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్, 2023'ను పునఃసమీక్షించి, సవరించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల జాతీయ మీడియాలో వచ్చిన కథనాలను జగన్ తన పోస్టులో ప్రస్తావించారు. ఎన్నికల సంఘం తీసుకున్న పలు నిర్ణయాలు, ఓటర్ల జాబితాల రూపకల్పన, ఈసీఐనెట్ నిర్వహణ వంటి అంశాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న వార్తలు ప్రజల్లో తీవ్రమైన ప్రశ్నలు, సందేహాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణల కంటే.. ఏయే అంశాలపై అభ్యంతరాలు నమోదయ్యాయి, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు, ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పులు, తొలగింపులు, పునరుద్ధరణ ప్రక్రియ ఎంత పారదర్శకంగా జరిగిందనే దానిపై ప్రజలకు స్పష్టత అవసరమని జగన్ నొక్కిచెప్పారు. ఈ విషయాలపై ప్రజలకు నమ్మకం కలిగించే చర్యలు తక్షణమే చేపట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో, గతంలో తాము కూడా మద్దతు ఇచ్చిన 2023 నాటి ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని జగన్ పేర్కొన్నారు. ఈ భయాలను తొలగించి, సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వమే ముందుకు రావాలని కోరారు. ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)లతో కూడిన త్రిసభ్య కమిటీ ద్వారానే ఎన్నికల కమిషనర్లను నియమించే పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. "పరీక్ష రాసే విద్యార్థే, తన ఎగ్జామినర్ ను నియమించుకుంటే, ఆ అధికారి ఎంత నిజాయతీపరుడైనా ఆరోపణలకు ఆస్కారం ఉంటుంది. ఆ స్థానంలో ఒక తటస్థ వ్యక్తి ఉంటేనే మేలు" అని జగన్ ఉదహరించారు. ఈ మార్పు ఎన్నికల సంఘంపై ప్రజల గౌరవాన్ని, విశ్వాసాన్ని కచ్చితంగా పునరుద్ధరిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో తమ పార్టీ ఎదుర్కొన్న అనుభవాలను కూడా జగన్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఏపీలో ఎస్ఐఆర్ (ూ×=) ప్రక్రియ సమయంలో అధికార పార్టీ తన అధికారాన్ని దుర్వినియోగం చేసిందని, అనేక సందర్భాల్లో తమ విజ్ఞప్తులను పట్టించుకోలేదని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలోనూ డివిజన్ల పునర్విభజన తీరుపై ప్రతిపక్షంగా తాము లేవనెత్తిన అభ్యంతరాలను పక్కన పెట్టేశారని అన్నారు. ఇలాంటి చర్యలు ఎన్నికల ప్రక్రియపై ప్రజా విశ్వాసాన్ని బలహీనపరుస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండటమే కాదు, అవి ఉన్నట్టుగా కనిపించాలని, వాటిని కాపాడటమే రాజ్యాంగ సంస్థల ప్రాథమిక విధి అని జగన్ తన పోస్టులో స్పష్టం చేశారు.

ఈ వార్త మీకు నచ్చిందా?.. నచ్చిన వార్తలను మీ మిత్రు

## సీఈసీ రాజీనామాకు డిమాండ్..
## దేశవ్యాప్తంగా నిరసనలు..

- మొదటి పేజి తరువాయి

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన జ్ఞానేష్ కుమార్ ను తక్షణమే పదవినుంచి తొలగించాలని, అరెస్ట్ చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. పరస్పర ప్రయోజనాలకోసం ప్రధాని మోదీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ తో కుమ్మక్కై ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ల దొంగలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని శపథం చేశారు.

**యూపీ, లక్నోలో..**

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ యూపీ రాజధాని లక్నోలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. ఓట్ల దొంగతనానికి పాల్పడి జ్ఞానేష్ దేశద్రోహానికి పాల్పడ్డారు..ఎన్నికల కమిషనర్ పదవిలో కొనసాగే అర్హత ఆయనకు లేదు. ఓట్లను దొంగిలించి ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడి చేశారు, ఇది క్షమించరాని నేరమని ఆయన తక్షణమే పదవి నుండి తొలగించి, అరెస్టు చేయాలని నిరసనకారులు నినాదాలు చేశారు.

**పశ్చిమ బెంగాల్ లో..**

దేశ ద్రోహుల చేతినుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, ఎలక్షన్ సిస్టమ్ లో జవాబుదారీతనం కావాలని పశ్చిమ బెంగాల్ లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోదీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనను అరెస్టును డిమాండ్ చేశారు. క్విడ్ ప్రో కో (పరస్పర ప్రయోజనం) కోసం పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో జ్ఞానేష్ కీలక పాత్ర పోషించారని దుయ్యబట్టారు. అందుకే జ్ఞానేష్ కుమార్ కు పద్మ భూషణ్ పురస్కారం ఇవ్వాలని బీజేపీ వర్గాలు ఇప్పుడు డిమాండ్ చేస్తున్నాయని విమర్శించారు. బీజేపీ, సీఈసీ వీరంతా ఓట్ల దొంగల ముఠా అని నినాదాలు చేశారు.

**పంజాబ్ లో..**

ప్రజాస్వామ్యంలో ఓట్లను దొంగిలించడం దేశద్రోహమే అవుతుంది.. ఈ పనికి పాల్పడిన సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రిజైన్ చేయాలని , అయనను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ పంజాబ్ లో ఆందోళనలు జరిగాయి. రాజ్ బ్రార్ నాయకత్వంలో పంజాబ్ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. దీజీ, –జజుజల నిరంకుశ పోకడను సవాల్ చేశారు.

**హర్యానాలో..**

ఓట్ల చోరీలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని వెంటనే జ్ఞానేష్ కుమార్ అరెస్ట్ చేయాలని హర్యానా కాంగ్రెస్ నేతృత్వంలో పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. ప్రజల హక్కులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇక జ్ఞానేష్ కుమార్ ప్రధాని మోదీ కూడా కాపాడలేరని స్పష్టం చేశారు కాంగ్రెస్ నేతలు. ఈ నిరసనల్లో భారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. భారీ ర్యాలీగా వస్తున్న కార్యకర్తలను బారికేడ్లు పెట్టి పోలీసులు అడ్డుకున్నారు. నిరసనకారులపై వాటర్ క్యానన్లు ప్రయోగించారు.

**బిహార్ లో..**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ ప్రజల తీర్పును అపహాస్యం చేస్తూ దేశద్రోహానికి పాల్పడ్డారని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీహార్ రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తాయి. నిరసనల్లో పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని మోదీ, జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**మణిపూర్ లో..**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నిరసనలు తలెత్తాయి. జ్ఞానేష్ కుమార్ ను పదవి నుంచితొలగించి అరెస్ట్ చేయాలని ఓక్రమ్ ఇబోబి సింగ్ నేతృత్వంలోని మణిపూర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆందోళనలు చేపట్టింది. ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసిన దేశ ద్రోహికి కఠిన శిక్ష పడేవరకు నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

**ఒడిశాలో..**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా, అరెస్ట్ ను డిమాండ్ చేస్తూ ఒడిశాలో కూడా నిరసనలు వెల్లువెత్తాయి. ఎన్నికల వ్యవస్థలో జవాబుదారి తనం కోరుతూ ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. రాజ్యాంగం చేతబట్టుకొని ప్రధానిమోదీ, జ్ఞానేష్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తే ఆందోళన వ్యక్తం చేశారు.

**సిమ్లా, హిమాచల్ ప్రదేశ్ లో..**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఓట్లను చోరీ చేసి దేశ ద్రోహానికి పాల్పడ్డారు. ఇది ఎప్పటికీ క్షమించరాని నేరం. జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలి. అతడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు జరిగాయి. యువత, మహిళలు నిరసనల్లో పాల్గొని ప్రధాని మోదీ, జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఇంఛార్జ్, అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం సమక్షంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు నిరసనల్లో పాల్గొన్నారు.

**ఉత్తరాఖండ్ లో..**

సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఉత్తరాఖండ్ లో కూడా నిరసనలు వెల్లువెత్తాయి. ఉత్తరాఖంవడ్ ఇన్ఛార్జ్ జనరల్ సెక్రటరీ కుమారి సెల్జా జీ, రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ గోడియాల్ జీ , జుగ్రా నేతల యశ్పాల్ ఆర్య జీ సమక్షంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఓట్లను దొంగిలించి జ్ఞానేష్ కుమార్ దేశద్రోహానికి పాల్పడ్డారని వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**జమ్మూ కాశ్మీర్ లో..**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా జమ్మూ కాశ్మీర్ లో పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. జ్ఞానేష్ కుమార్ ను పదవినుంచి తొలగించాలని, అరెస్ట్ చేయాలని, ఓట్ల దొంగతనం చేసినందుకు గాను కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు.

# గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి...

ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి మహాగణపతి శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ గణనాథుడి ఎదుట డ్యాన్స్ చేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి. ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది.ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన క్రేన్ నంబర్ 4 వద్దకు విగ్రహాన్ని చేర్చిన అనంతరం, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ల సహాయంతో విగ్రహాన్ని సాగరంలో నిమజ్జనం చేశారు. తమ ఆరాధ్య దైవమైన గణనాథుడికి భక్తులు అశ్రునయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జన ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.

**బడా గణేశ్ శోభాయాత్ర: పోలీసులతో కలిసి స్టెప్పులేసిన దానం నాగేందర్**

హైదరాబాద్‌లోని ప్రఖ్యాత ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన శోభాయాత్ర వైభవంగా సాగుతోంది. ఈ వేడుకల్లో భాగంగా దానం నాగేందర్ ఉత్సాహంగా నృత్యం చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శుక్రవారం వైభవంగా సాగుతున్న శోభాయాత్రలో ఈ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. బందోబస్తు విధుల్లో ఉన్న కొందరు మహిళా కానిస్టేబుళ్లతో

కలిసి దానం నాగేందర్ నృత్యం చేశారు. ఇటీవల విడుదలైన 'ప్యారడైజ్' చిత్రంలోని ఒక పాటకు ఆయన ఉత్సాహంగా స్టెప్పులు వేసి వేడుకల్లో జోష్ నింపారు. పండుగ వాతావరణంలో ఆయన చేసిన ఈ నృత్యం అక్కడ ఉన్న భక్తులను, చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దానం నాగేందర్ నృత్యంపై నెటిజన్లు విభిన్న రీతుల్లో స్పందిస్తున్నారు. కొందరు ఆయనలోని ఉత్సాహాన్ని ప్రశంసిస్తుండగా, మరికొందరు ఈ అంశంపై రాజకీయ కోణంలో వ్యాఖ్యలు చేస్తున్నారు.

## ఏపీలో వర్ష బీభత్సం.. అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు

- మొదటి పేజి తరువాయి

క్షేత్రస్థాయిలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ఆయన ఉన్నతాధికారులతో శుక్రవారం ప్రత్యేక టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బూడితి రాజశేఖర్, ఇతర ఉన్నతాధికారులతో పాటు పార్వతీపురం మన్యం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు జరిగిన నష్టంపై వెంటనే క్షేత్రస్థాయి సర్వే ప్రారంభించి, వివరాల నమోదును వేగవంతం చేయాలని ఆదేశించారు. పొలాల్లో నిలిచిన నీటిని తొలగించడం, అధిక తేమ వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించి, వారిలో అవగాహన కల్పించాలని సూచించారు.ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా దెబ్బతిన్న ముఖ్యమైన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను సమీక్షించాలని స్పష్టం చేశారు.

అదే సమయంలో, ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీటిని సాధ్యమైనంత మేర సంరక్షించుకోవాలని మంత్రి సూచించారు. పంటలకు హాని కలిగించే చోట నీటిని తొలగిస్తూనే, చెరువులు, జలాశయాలు, ఇతర నీటి వనరుల్లో నీటిని నిల్వ చేసి భవిష్యత్తు సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య శాఖలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు, ప్రజలకు నిరంతర సహాయం అందించాలని అచ్చెన్నాయుడు ఆదేశించారు.

## 'బ్రహ్మోస్'తో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు

- మొదటి పేజి తరువాయి

నాశనం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నోయిడాలో నిర్వహించిన ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. 2017 తర్వాత భాజపా హయాంలో యూపీ అద్భుత ప్రగతి సాధిస్తోందన్నారు.ప్రధాని మోదీ సారథ్యంలో భారత్ గణనీయమైన ఆర్థిక వృద్ధి సాధిస్తోందన్న అమిత్ షా.. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేనప్పటికీ స్థిరమైన వృద్ధిరేటు సాధిస్తున్నామన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను ఉన్నత స్థితికి చేర్చే లక్ష్యంగాలో భాగంగానే.. మారిషస్, యూఏఈ, ఆస్ట్రియా, యూకే, ఒమన్, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్ తదితర దేశాలతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. యూపీలో అమలు చేస్తున్న 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' విధానాన్ని అమిత్ షా అభినందించారు. గతంలో ఇక్కడి ప్రజలు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారని.. కానీ, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయన్నారు. గతంలో నేరపూరిత వాతావరణం ఉన్న రాష్ట్రం.. ఇప్పుడు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో రక్షణ రంగం, వాహన ఉత్పత్తి, వైద్యపరికరాల తయారీ వైపు దూసుకెళ్తోందని కితాబిచ్చారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున (సెప్టెంబర్ 25) ప్రధాని మోదీ 'మేక్ ఇన్ ఇండియా' నినాదం తీసుకొచ్చినట్లు అమిత్ షా గుర్తు చేశారు.

## స్టాలిన్ గారూ, ఈ కేసుపై నోరు విప్పండి

తమిళనాడు రాజకీయాలు మరోసారి రసవత్తరంగా మారాయి. ప్రముఖ గ్రానైట్ వ్యాపారి ఆర్. వీరమణిపై నమోదైన లైంగిక వేధింపుల కేసు విషయంలో ముఖ్యమంత్రి విజయ్, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "స్టాలిన్ గారూ, ఈ ఉదంతంపై మీ మౌనాన్ని వీడండి" అంటూ డిమాండ్ చేశారు.అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విజయ్, డీఎంకే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. "2025 అక్టోబర్‌లో, డీఎంకే హయాంలోనే ఈ కేసుకు సంబంధించి ఫిర్యాదు అందినప్పటికీ, వారు నిందితులను రక్షించేందుకు వాస్తవాలను తారుమారు చేశారు. తగిన ఆధారాలు లేవనే సాకుతో కేసును మూసివేశారు" అని విజయ్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో డీఎంకే, ఏఐఏడీఎంకే పరస్పరం సహకరించుకున్నాయని, అందుకే ఆ రెండు పార్టీలు నోరు మెదపడం లేదని విమర్శించారు. తన తల్లిని విమర్శించినా సహిస్తానని, కానీ తమిళనాడులోని మహిళా లోకాన్ని అవమానిస్తే ఊరుకోనని స్పష్టం చేశారు. డీఎంకే శ్రేణులు, వారి కుటుంబ సభ్యులు ఇటువంటి అనైతిక చర్యలను ప్రోత్సహిస్తున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.

మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలతో జెమ్ గ్రానైట్స్ చైర్మన్ ఆర్. వీరమణితో పాటు, ఆయనకు సహకరించిన శాంతి,

మహేంద్ర సింహన్‌లను 2026 ఆగస్టులో పోలీసులు అరెస్టు చేశారు. 2025లో ఓ సామాజిక కార్యకర్త విడుదల చేసిన వీడియో ఫుటేజ్‌తో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుత టీవీకే ప్రభుత్వ హయాంలో ప్రత్యేక పోక్సో కోర్టు గతంలోని క్లోజర్ రిపోర్ట్‌ను తిరస్కరించి, పునర్విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో పోలీసులు బాధితులను గుర్తించి, వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, టీవీకే, డీఎంకే మధ్య ఇది ప్రధాన రాజకీయ పోరాటంగా మారింది.

## పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి లోకేశ్ అహ్మదాబాద్ పర్యటన

- మొదటి పేజి తరువాయి

తయారీ వంటి కీలక రంగాల్లో ఏపీలో ఉన్న అవకాశాలను వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, అందిస్తున్న ప్రోత్సాహకాలను తెలియజేసి, పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించారు. లోకేశ్ ప్రతిపాదనలపై కంపెనీల ప్రతినిధులు సానుకూలంగా స్పందించి, వాటిని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.క్లీన్ ఎనర్జీలో ఏపీని ఎంచుకోండి: టోరెంట్ గ్రూప్‌తో లోకేశ్‌ఫార్మా, పవర్ రంగాల్లో అగ్రగామిగా ఉన్న టోరెంట్ గ్రూప్ చైర్మన్ సమీర్ మెహతా, ఇతర డైరక్టర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలోని ఫార్మా క్లస్టర్లలో ఏపీఐ, ఇంటర్మీడియట్ తయారీ సామర్థ్యాన్ని విస్తరించాలని కోరారు. ముఖ్యంగా, పునరుత్పాదక ఇంధన రంగంలో టోరెంట్ గ్రూప్ ప్రణాళికలను ప్రస్తావిస్తూ.. సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టులకు ఏపీ అనువైనదని తెలిపారు. పంప్డ్-స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ వంటి క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్రాన్ని గమ్యస్థానంగా ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సమీర్ మెహతా స్పందిస్తూ.. 2030 నాటికి 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించడమే తమ లక్ష్యమని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తప్పక పరిశీలిస్తామని చెప్పారు.కాకినాడలో ఇండస్ట్రియల్ పార్క్: వెల్ స్పన్ గ్రూప్‌కు ప్రతిపాదనటెక్స్‌టైల్స్, మౌలిక సదుపాయాల రంగంలో ప్రసిద్ధిగాంచిన వెల్ స్పన్ వరల్డ్ గ్రూప్ సీఈఓ నితిన్ జైన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. గతంలో దావోస్‌లో సీఎం చంద్రబాబుతో జరిగిన చర్చల పురోగతిని సమీక్షించారు. విశాఖపట్నంలో వెల్స్‌పన్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. కాకినాడలో టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, పైపుల తయారీ, గ్రీన్ అమ్మోనియా యూనిట్లతో కూడిన ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నితిన్ జైన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కర్నూలు, కడపలో తమ సంస్థ 100 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును నిర్వహిస్తోం దని, తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని తెలిపారు.

**నెల్లూరులో ఆయిల్ రిఫైనరీలు: గోకుల్ ఆగ్రోతో చర్చలు**

వంట నూనెల తయారీలో పేరొందిన గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ చైర్మన్ కనుభాయ్ ఠక్కర్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో ఇప్పటికే ఉన్న ప్లాంట్‌కు అదనంగా పామాయిల్, సోయాబీన్ ఆయిల్ రిఫైనరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై కనుభాయ్ ఠక్కర్ స్పందిస్తూ.. కృష్ణపట్నంలో తమ ప్లాంట్ 2024 నుంచి ఉత్పత్తి ప్రారంభించిందని, దక్షిణాది మార్కెట్ల కోసం విస్తరణ ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విశాఖలో టైర్ల తయారీ యూనిట్: చిరిపాల్ గ్రూప్‌కు ఆహ్వానం

టెక్స్‌టైల్స్, కెమికల్స్ రంగాల్లోని చిరిపాల్ గ్రూప్ మేనేజింగ్ డైరక్టర్ బ్రిజ్ మోహన్ చిరిపాల్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. విశాఖపట్నం కనెక్టివిటీ, మౌలిక వసతులను వివరిస్తూ.. అక్కడ గ్రీన్‌ఫీల్డ్ టైర్ల తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై బ్రిజ్ మోహన్ చిరిపాల్ స్పందిస్తూ.. ప్రస్తుతం తమకు పలు రాష్ట్రాల్లో తయారీ యూనిట్లు ఉన్నాయని, టైర్ల తయారీకి సంబంధించి ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామని అన్నారు.

**డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టండి: ఎస్టీ టెలీమీడియాతో లోకేశ్**

డేటా సెంటర్ల దిగ్గజం ఎస్టీ టెలీమీడియా వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ జెనాతో లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నం డేటా సెంటర్ హబ్‌గా ఎదుగుతోందని, ఇప్పటికే గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు ముందుకు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. దీనిపై గౌతమ్ జెనా స్పందిస్తూ.. తమ సంస్థ కార్యకలాపాలను వివరించి, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామని చెప్పారు.

**విశాఖలో ప్రీ ఫ్యాబ్ కేంద్రం: ఈప్యాక్ గ్రూప్‌తో భేటీ**

ప్రీ ఫ్యాబ్ నిర్మాణ రంగంలో పేరొందిన ఈప్యాక్ గ్రూప్ చైర్మన్ భజరంగ్ బోత్రాతో లోకేశ్ సమావేశమయ్యారు. డేటా సెంటర్ల నిర్మాణానికి అవసరమైన ప్రీ ఫ్యాబ్ నిర్మాణ కేంద్రాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని కోరారు. భజరంగ్ బోత్రా మాట్లాడుతూ.. ఇప్పటికే శ్రీసిటీలో తమకు తయారీ యూనిట్లు ఉన్నాయని, విశాఖ ప్రతిపాదనను కూడా పరిశీలిస్తామని తెలిపారు.

**పైపుల తయారీ కేంద్రం ఏర్పాటు చేయండి: ఆస్ట్రల్ పైప్స్‌తో సమావేశం**

పైపుల తయారీలో అగ్రగామిగా ఉన్న ఆస్ట్రల్ పైప్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ అల్కేష్ పంచల్‌తో మంత్రి లోకేష్ చర్చలు జరిపారు. రాష్ట్రంలో నిర్మాణ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నందున, కాకినాడ లేదా అనకాపల్లిలో పైపుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. అల్కేష్ పంచల్ స్పందిస్తూ.. తమకు దేశవ్యాప్తంగా విస్తృత నెట్‌వర్క్ ఉందని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### మహిళలను పారిశ్రామికవేత్తలుగా
## తీర్చిదిద్దడమే లక్ష్యం

- మొదటి పేజి తరువాయి

సరస్ ప్రదర్శన' ఏర్పాట్లను రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఉన్నతాధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన మార్కెట్ సౌకర్యాన్ని కల్పించడమే ధ్యేయంగా నేషనల్ సరస్ మేళాను ఢిల్లీ నుంచి విజయవాడకు తీసుకువచ్చామని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే మహిళా పారిశ్రామికవేత్తల కోసం 350కి పైగా స్టాళ్లను సిద్ధం చేస్తున్నామని, ఇందులో ఒక్క ఆంధ్రప్రదేశ్ నుంచే సుమారు 250 స్టాళ్లు ఉండబోతున్నాయని చెప్పారు. ఇతర రాష్ట్రాల విజయగాథలు, అనుభవాలను పంచుకునేలా ఈ మేళాను ఒక ప్రత్యేక 'లెర్నింగ్ సెంటర్'గా మలుస్తున్నామని పేర్కొన్నారు.అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు తయారు చేసే నాణ్యమైన ఉత్పత్తులకు గుర్తింపు కల్పించేందుకు 'స్వయం ఏపీ' అనే ప్రతిష్ఠాత్మక బ్రాండ్‌ను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. దీని ద్వారా బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ అంశాల్లో మహిళలకు అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. దసరా ఉత్సవాల వేళ విజయవాడకు ఈ ఈవెంట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని, సందర్శకుల సౌకర్యాలు, భద్రత మరియు పార్కింగ్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులతో విస్తృత సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

## ఏపీ హోంగార్డులకు శుభవార్త.. కానిస్టేబుల్ ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని హోంగార్డులకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. పోలీస్ శాఖలో స్టైపెండరీ కానిస్టేబుల్ (డ్రైవర్) పోస్టుల నియామకాల్లో వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గతంలో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులను (జీవో) సవరిస్తూ నూతన ఆదేశాలను జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయం సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న హోంగార్డులకు పెద్ద ఊరటనిచ్చింది.పోలీస్ రవాణా సంస్థ (ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్) పరిధిలో 198 స్టైపెండరీ కానిస్టేబుల్ (డ్రైవర్) పోస్టుల భర్తీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెలలోనే విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నియామక ప్రక్రియ నుంచే హోంగార్డులకు కేటాయించిన 10 శాతం రిజర్వేషన్ అమలులోకి రానుంది.నూతన రిజర్వేషన్ విధానం ద్వారా శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరాలనుకుంటున్న అర్హులైన హోంగార్డులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల హోంగార్డుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కేకు.. ఢిల్లీ హైకోర్టు నోటీసులు

- మొదటి పేజి తరువాయి

రత్న సింగ్ లకు నోటీసులిచ్చింది. అనుమతి లేకుండా తన ఫొటోలు తీసి డిజిటల్ మార్ఫింగ్ చేశారని ఓ మహిళనుంచి ఇచ్చిన ఫిర్యాదుతో స్పందించిన కోర్టు ఈ చర్యలు తీసుకుంది. అక్టోబర్ 2న దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ రెడీ అవుతున్న క్రమంలో హైకోర్టు నోటీసులు చర్చనీయాంశమయ్యాయి. తన అనుమతి లేకుండా ఫోటో తీసి, ఆ తర్వాత ఏఐ, ఫేస్-స్వాపింగ్ టూల్స్ ఉపయోగించి డిజిటల్‌గా మార్ఫింగ్ చేశారని ఓ మహిళ ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు ప్రకారం.. ప్రధాని మోదీతో కలిసి ఉన్న తన ఫోటోపై ఆమె ముఖాన్ని మార్ఫింగ్ చేశారని ఆరోపించింది. ఫిర్యాదులో సీజేపీ ప్రతినిధులు సౌరభ్ దాస్, అభిజీత్ దీప్కే, అశుతోష్ రాంకా, రత్న సింగ్‌లతో పాటు వారి సహచరులుగా ఆరోపించబడిన కొందరి పేర్లను పేర్కొంది.జంతర్ మంతర్ నిరసనల్లో మార్ఫింగ్ చేసిన తన ఫోటోలను ప్రచారం చేయడంతో తనకు బెదిరింపులు వస్తున్నాయని, తనకు రక్షణ కల్పించాలని కోరింది. ఈ కేసులో మహిళకు పూర్తి రక్షణ కల్పించాలని శుక్రవారం ఢిల్లీ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. మహిళ భద్రతకోసం ఆమె అడ్రస్ సీక్రెట్ గా ఉంచాలని పోలీసులకు సూచించింది. దీంతోపాటు వెబ్ లింకులనుంచి , సోషల్ మీడియా ప్లాట్ ఫాంలనుంచి ఆమె ఫోటోలను తొలగించాలని మెటాకు ఆదేశించింది. ఈ కేసు ఢిల్లీ హైకోర్టులో ఉండగా, పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. సీఈసీ రాజీనామా చేయాలని అక్టోబర్ 2న సీజేపీ తలపెట్టిన దేశవ్యాప్త నిరసనలకు ముందు హైకోర్టు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# గణపతికి విశేష అలంకరణ



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 25:**గణపతి నవరాత్రి మహోత్సవాలు ముగియడంతో గణొతి స్వామివారి విశేష అలంకరణలు చేసారు.
మాచవరం, కోఠీవారిఅగ్రహారం గ్రామంలో వేంచేసియున్న శ్రీ భువనేశ్వరీ సమేత విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించిన గణపతి నవరాత్ర మహోత్సవాలలో భాగంగా విశేషాలంకరణలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

# బాలగణపతి స్వామివారిఊరేగింపు

**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 25:**మాచవరం పంచాయతీ పరిధిలోని సత్యసాయినగర్ లో ఏర్పాటుచేస వేంచేసియున్న శ్రీ బాలగణపతి మందిరమలో ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవమూర్తి నవరాత్రి సందర్భంగా పూజలు అందుకున్నారు. ఆలయప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ని దర్శించుకున్నారు. స్వామివారిని రథంపై ఏర్పాటు చేసి పూలమాలలతొౌఇ ప్రత్యేకమైన అలంకరణ లు చేసి భారీ ఊరేగింపుతో నిమజ్జనం చేశారు మేళతాళాలతో కౌశిక నందు నిమజ్జనకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# విజయదశమి కి పందిరిరాట ముహూర్తం

**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 25:**స్థానిక పశువుల సంతలో వేంచేసియున్న శ్రీ విజయ కనకదుర్గ అమ్మవారి దశమి వేడుకలకు పందిరి రాట ముహూర్తం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# రైతులకు పంటనష్టం అందేలా చర్యలు తీసుకుంటాం: ఎమ్మెల్యే సత్యప్రభ.

ఆర్‌డీఓ కృష్ణమూర్తితో కలిసి దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన.





**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 25:** మండల పరిధి యర్రవరం గ్రామంలో తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఆర్‌డీఓ కె కృష్ణమూర్తితో కలిసి శుక్రవారం పరిశీలించారు. పంట పొలాల్లో చేరిన వరదనీటి ఉద్ధృతిని, పంటలకు జరిగిన నష్టాన్ని పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తుఫాను కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం తరఫున పంటనష్టం అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సత్యప్రభ హామీ ఇచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని సూచించారు.రైతులకు అండగా ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, బొదిరెడ్డి గోపాలకృష్ణ, పెంటకోట మోహన్, మండల తహసీల్దార్ కె కీర్తి, ఎంపీడీవో రామరాజు వర్మ, ఏవో ఎం.వి. రాజేష్, హెచ్‌వో దివ్యశ్రీ, స్థానిక నాయకులు బస్సా మహాలక్ష్మి ప్రసాద్, మైరాల కనకారావు, గంగిరెడ్ల మణికంత, పసల సూరిబాబు, అవసరాల సూర్య ప్రకాశ్‌రావు, సూతి బాబులు, బ్యాంక్ రాజు, నూకతాటి ఈశ్వరుడు, పసల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# నీట మునిగిన పేకేటి వీరమ్మచెరువు ఆయకట్టు పొలాలు



ఆందోళన చెందుతున్న రైతులు

**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబరు 25:** జగ్గంపేటలోని పేకేటి వీరమ్మ చెరువు ఆయకట్టు ప్రాంతమైన పూలతోట, కోనేటి చెరువు పక్కన పొలాల్లోకి వర్షపు నీరు చేరడంతో పొలాల్లోని పూర్తిగా నీటమునిగాయి. మొన్నటి వరకు వర్షాలు కోసం ఎదురుచూసిన రైతాంగం తుఫాన్ ధాటికి కురిసిన వర్షంతో కాలువల్లో నీరు చేరి పొంగి పొర్లి పొలాల్లోకి చేరడంతో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో రైతులు తమ పంటకు నష్టం వాటిల్లుతుందేమోనని ఆవేదన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, వ్యవసాయాధికారులు తమ పొలాలను పరిశీలించి న్యాయం చేయా లని రైతులు కోరుతున్నారు.

# వర్షాలకు పంటల్లో జాగ్రత్తలు తీసుకోవాలి....

**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 25:–** ప్రస్తుత వర్షాల వల్ల నీట మునిగిన పంటలలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి పి గాంధీ రైతులకు సూచించారు.అచ్చంపేట,శంఖవరం, నెల్లిపూడి గ్రామాల్లో నీట మునిగిన వరి , ప్రత్తి పంటలను రైతులతో పరిశీలించి సూచనలు ఇచ్చారు.వర్షాల అనంతరం పొలంలో నీరు తీసివేసి వరి పొలంలో ఎకరాకు 20కిలోల యూరియా,20కిలోల పొటాష్ పైపాటుగా వేయడం వల్ల పంట నిలదొక్కుకుంటుందని వివరించారు.ఈ వాతావరణములో ఆశించే తెగుళ్ల నివారణకు కార్బండజిం 2గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ప్రత్తి పంటలో నీరు తీసివేసి ఎండగా ఉన్న సమయంలో పొటాషియం నైట్రేట్ 2% ద్రావణాన్ని వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పత్తి పూత, పిందె దశలో ఉన్నపుడు ఎకరాకు 25కిలోల యూరియా,10కిలోల పొటాష్ ను పైపాటుగా వేయాలని సూచించారు. ప్రత్తిలో ముందు జాగ్రత్త చర్యగా కాయకుళ్ళు నివారణకు 3గ్రా.కాపర్ ఆక్సీ క్లోరైడ్ లీటరు నీటిలో కలిపి పిచికారీ



చేయాలని తెలిపారు. ఏ ఈ ఓ శ్రీనివాస్,వ్యవసాయ ఉద్యాన సహాయకులు శ్యామ్ సుందర్, క్రాంతి,రాజు, రైతులు పాల్గొన్నారు.

# కిర్లంపూడిలో ఘనంగా నమామి భారతం- వందేమాతరం.




**కిర్లంపూడి,పెన్ పవర్, సెప్టెంబర్,25:**వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కిర్లంపూడి మండలంలో 'నమామి భారతం–-వందేమాతరం' కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్,న్యూఢిల్లీ పిలుపు మేరకు భారతీయ విద్యా కేంద్రం,విశాఖపట్నం ఆధ్వర్యంలో కిర్లంపూడి విజ్ఞాన భారతి హైస్కూల్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.కిర్లంపూడి గ్రామంలోని శ్రీ సత్యదేవా కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజ్ఞాన భారతి హైస్కూల్ విద్యార్థులు,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులతో పాటు ఆర్ఎస్ఎస్,బీజేపీ ప్రతినిధులు, అధికారులు,నాయకులు, గ్రామస్థులు కలిపి సుమారు 300 మంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా వందేమాతరం పూర్తి గీతాన్ని అందరూ కలిసి సామూహికంగా ఆలపించారు.ఈ కార్యక్రమానికి బీవీకే జాయింట్ సెక్రటరీ ఆర్ సత్యనారాయణ అధ్యక్షత వహించగా,విద్యాభారతి ప్రాంత కార్యదర్శి కె వి ఆనంద్ ప్రధాన వక్తగా హాజరయ్యారు.కిర్లంపూడి ఎంపీడీఓ బి హరికృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కె వి.ఆనంద్ మాట్లాడుతూ వందేమాతరం గీతం ఆవిర్భావం,చారిత్రక నేపథ్యం, దేశప్రజల్లో జాతీయ భావాన్ని,దేశభక్తిని పెంపొందించడంలో దాని ప్రాధాన్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో విజ్ఞాన భారతి హైస్కూల్ ప్రధానాచార్యులు జి శ్రీనివాసరావు,ఆర్ఎస్ఎస్ ప్రత్తిపాడు ఖండ ప్రముఖ్ ముక్కు సుబ్రహ్మణ్యం,కిర్లంపూడి మండల బీజేపీ అధ్యక్షులు శరకణం రాజబాబు,ఆర్ఎస్ఎస్ జిల్లా సేవా ప్రముఖ్ శివయ్య,బిజెపి నాయకులు అల్లు శివరామకృష్ణ,బిజెపి మండల మాజీ అధ్యక్షులు యడాలి రాంబాబు,కంటా కాశీవిశ్వనాదం, భువనగిరి కాశీవిశ్వనాధం,దొడ్డా అప్పారావు,కోలా కృష్ణ, బుద్ధ పెదకాపు,బద్రి తదితరులు పాల్గొన్నారు.

# ముంపు ప్రాంత ప్రజలకు పునరావాసం కల్పించిన నగరపాలక సంస్థ



**ప్రతాప్‌నగర్ మాల కొండయ్య పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు**

**బాధితులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించిన అధికారులు**

**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 25:**భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, వారికి సురక్షిత పునరావాసం కల్పించినట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు.ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ముంపునకు గురైన ప్రతాప్‌నగర్, ట్రెజరీ కాలనీ కాలువగట్టు ప్రాంతాలను గురువారం సాయంత్రం కమిషనర్ తన బృందంతో కలిసి సందర్శించారు. కాలువగట్టు వద్ద నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేశారు.ఈ సందర్భంగా జనసేన నాయకులు చోడిశెట్టి శ్రీమన్నారాయణ, నరం మణికంఠ, మనోహర్ గుప్తా, స్వాతి తదితరులు ముంపు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి, అవసరమైన వసతి సౌకర్యాలు కల్పించాలని కమిషనర్‌ను కోరారు.దీనిపై స్పందించిన కమిషనర్ బాధితులను ప్రతాప్‌నగర్‌లోని మాల కొండయ్య పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. శుక్రవారం వారికి భోజనంతో పాటు అవసరమైన వసతి సౌకర్యాలు కల్పించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దారపు శిరీష, దుర్గాప్రసాద్, చెన్నంశెట్టి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

# డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రంఅందజేచిన వీఆర్‌ఏల సంఘం ప్రతినిధులు.

**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**మండల కేంద్రమైన ఆలమూరు తాసిల్దార్ కార్యాలయం ఎదుట గల ధర్నా చౌక్ లో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం చేస్తున్న నిరవధిక సమ్మె గురువారం నాటికి 10వ రోజుకు చేరింది. మండల వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో ఆలమూరు మార్కెట్ వద్ద గల డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పే స్కేల్ ఇవ్వాలని, అర్హులైన వారికి పదోన్నతి కల్పించాలని, మరణించిన వీఆర్‌ఏ కుటుంబాల్లో ఒకరికి కారుణ్య నియామకం కల్పించాలని వారు డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఆలమూరు మండల గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్షుడు తాతపూడి ఇషాక్ సెక్రటరీ కె శివరామారావు, ఉపాధ్యక్షుడు భువనగిరి ఏసు, సలహాదారుడు నాగేశ్వరరావు, మండల వీఆర్‌ఏలు దీక్షలో పాల్గొని నినాదాలు చేశారు.



## మద్యం షాపుటెండర్లకు నోటిఫికేషన్



**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**ఆలమూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఒక మద్యం షాపు ఖారారుకి టెండర్లు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆలమూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఐడి నాగేశ్వరరావు తెలిపారు. ఆలమూరు సర్కిల్ పరిధిలోని 23 మద్యం షాపులకు గాను 22 షాపులకు పాతవారికి రెన్యువల్ చేయటం జరిగిందని అయితే మండపేట రూరల్ పరిధిలోని ఒక షాప్ కు రెన్యువల్ కాకపోవడంతో రీ టెండర్లు పిలవడం జరిగిందని ఆయన వివరించారు. ఈ షాపుకు దరఖాస్తు చేసుకునే వారు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఒక షాప్ కు రూ. 3 లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తులు అక్టోబర్ ఒకటో తేదీ నాటికి అందజేయాలని ఆయన వివరించారు. ఈ షాప్ కు కనీసం నాలుగు దరఖాస్తులు రావాల్సి ఉందని లేనిపక్షంలో లాటరీ నిలిపివేయడం జరుగుతుందని సిఐ నాగేశ్వరావు తెలిపారు.

## జల్దాం నుండి కత్తిపూడి బైపాస్ రహదారి నిర్మించాలి....

- మైనింగ్ భారీ వాహనాల నుంచి 13 గ్రామాల ప్రజలకు విముక్తి కల్పించాలి....
- శంఖవరం గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మేకల కృష్ణ, ఉపాధ్యక్షుడు గునపర్తి అపురూప్, బిజెపి నాయకుడు చిలుకూరి రామ్ కుమార్...







**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 25:-** కాకినాడ జిల్లాప్రత్తిపాడు నియోజకవర్గం లో రౌతులపూడి మండలం జల్దాం నుంచి శంఖవరం మండలం కత్తిపూడి వరకు బైపాస్ రహదారి నిర్మించి మైనింగ్ భారీ వాహనాల రాకపోకల నుంచి 13 గ్రామాల ప్రజలకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తూ శంఖవరంలో శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో శాంతియుత రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు దీక్షలు చేపడుతున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.దీక్షా శిబిరాన్ని బీజేపీ నాయకుడు చిలుకూరి రాంకుమార్ బీజేపీ శ్రేణులతో కలిసి సందర్శించి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు మేకల కృష్ణ,ఉపాధ్యక్షుడు గునపర్తి అపురూప్, బీజేపీ నాయకుడు చిలుకూరి రాంకుమార్ మాట్లాడుతూ మైనింగ్ భారీ వాహనాల రాకపోకలతో 13 గ్రామాల ప్రజలు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రధాన రహదారిపై భారీ వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలు భయాందోళనల మధ్య ప్రయాణించాల్సి వస్తోందన్నారు.ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు,ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జల్దాం నుంచి కత్తిపూడి వరకు బైపాస్ రహదారి నిర్మిస్తే మైనింగ్ భారీ వాహనాలను గ్రామాల వెలుపల నుంచి మళ్లించే అవకాశం ఉంటుందని, తద్వారా 13 గ్రామాల ప్రజలకు ట్రాఫిక్ సమస్య నుంచి ఉపశమనం కలుగుతుందని తెలిపారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం బైపాస్ రహదారి నిర్మాణానికి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ నెల 29వ తేదీలోగా బైపాస్ రహదారి నిర్మాణంపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పర్వత రామకృష్ణ, పగడాల మోహన్ సన్యాసిరావు,గుద్దాటి నాగేశ్వరరావు,బుర్రా వీర వెంకట సత్య నారాయణ, బొమ్మిడి సత్య నారాయణ, రేలంగి వెంకట సత్య నారాయణ, మొగలి శ్రీను, ములికి అప్పారావు,బత్తిన తాతాజీ, శంఖవరం గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## పండిట్ దీన్ దయాళ్ ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలి.

-మండల బిజెపి అధ్యక్షుడు శరకణం రాజబాబు.

**కిర్లంపూడి,పెన్ పవర్ సెప్టెంబర్, 25:** పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కిర్లంపూడి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు పిలుపునిచ్చారు.

కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి ఏఎన్ఎల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆదేశాలతో, కాకినాడ జిల్లా బిజెపి అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, కాకినాడ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి , జగ్గంపేట నియోజకవర్గం ఇంచార్జ్ కుండల సాయి కుమార్ యాదవ్ సూచనల మేరకు శరకణం రాజబాబు ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షులు శరకణం రాజబాబు మాట్లాడుతూ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని, సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, పేద కుటుంబాల ఆర్థిక బలోపేతానికి, సమగ్ర గ్రామీణ అభివృద్ధికి, ప్రతి ఒక్కరూ కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.పేదరిక నిర్మూలన, విద్య, ఉపాధి అవకాశాల ద్వారా నిరుపేద కుటుంబాలు బలోపేతం కావాలని,పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం సిద్ధాంతం ద్వారా వ్యక్తి, సమాజం, దేశం సమగ్రాభివృద్ధి సాధించాలనే ఆలోచనను ప్రజలకు తెలియజేయాలన్నారు.భారతీయ విలువలు,



సంస్కృతి, సామాజిక బాధ్యతలను కాపాడుకోవాలని రాజబాబు ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా బిజెపి ఎగ్జిక్యూటివ్ మెంబర్ అల్లు శివరామకృష్ణ, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు కంటా కాశీ విశ్వనాథం, మండల ఉపాధ్యక్షులు కొప్పిశెట్టి జగదీష్, బుద్ధ పెద్దకాపు, మండల బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షులు పీతల సుభాకర్, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి దొడ్డా అప్పారావు, మండల కోశాధికారి బుర్రె విజయ్ కుమార్, యువ నాయకులు పప్పుశెట్టి వెంకటేష్, పలువురు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి





- డ్రైనేజీలు, చెరువుల పరిస్థితిని పరిశీలించాలి
- పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి ఆదేశం

**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ ,25** భారీ వర్షాల అనంతరం గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని గండేపల్లి ఎంపీడీవో కె. హరికృష్ణ సత్యారెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు.

వర్షాల కారణంగా డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగునీటి నిల్వలను తొలగించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టి, దోమల వ్యాప్తి, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కార్యదర్శులకు తెలిపారు.ఎల్లమెల్లి గ్రామంలో ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో శిరీష స్వయంగా పర్యవేక్షిస్తూ పంచాయతీ కార్యదర్శి, సిబ్బందితో డ్రైనేజీలను శుభ్రం చేయించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు.

మల్లేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న చెరువు వర్షపు నీటితో పొంగిపొర్లడంతో నీరు బయటకు వెళ్లేందుకు గండి ఏర్పాటు చేయించారు. నీటి నిల్వల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

మండలంలోని 18 గ్రామాల్లోనూ పారిశుధ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన చోట వెంటనే క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో సూచించారు. గ్రామాల్లో ప్రజారోగ్యానికి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తూరు సెంటర్ కనకదుర్గమ్మ ఆలయం వద్ద దసరా నవరాత్రులకు రాట ముహూర్తం



**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**దసరా నవరాత్రుల సందర్భంగా జరిగే వేడుకల కోసం కొత్తూరు సెంటర్ కనకదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం రాట ముహూర్తం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రాట పాతి ఆలయ అర్చకులు పెద్దింటి హనుమాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్టోబర్ 11వ తేదీ నుంచి అమ్మవారి ఆలయం వద్ద శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతాయని వారు తెలియజేసారు.

## తుఫాన్ బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించి తక్షణమే ఆదుకోవాలి.

-రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల డిమాండ్.




**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్, 25:**గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు వల్ల పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి తక్షణ ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమరాయణం పేట-బూరుగుపూడి మధ్యలో ఉన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, ఇటు వరదలు వచ్చి రైతన్నలు నష్టాల పాలవుతున్నారన్నారు. బ్యాంకుల్లో అప్పులు చేసి, బయట అధిక మొత్తంలో వడ్డీలకు తెచ్చి పెట్టుబడులు పెట్టారన్నారు.ఇప్పుడు అకాల వర్షాల కారణంగా పంటలు మొత్తం మునిగిపోయి,అయోమయ పరిస్థితిలో రైతులు ఉన్నారన్నారు.తక్షణమే పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి 50 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించి, రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బాధిత రైతులు పాల్గొన్నారు.

## సేవా సంకల్ప అభియాన్ భాగంగా అంగన్వాడీ సెంటర్లో ఉత్సవాలు...

**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 25:-** ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా సేవ సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా ఐ.సి. డి.ఎస్ ప్రాజెక్టు శంఖవరం పరిధిలోని శంఖవరం, రౌతులపూడి అంగన్వాడీ కేంద్రాలలో సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 7 వరకు అంగన్వాడి ఉత్సవం జరుప బడుతుంది. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో మూడు రోజులు పాటు నిర్వహించ బడతాయి. స్థానిక పిల్లలు, తల్లుల చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి. ప్రీ స్కూల్, ప్రభుత్వ పోషణ,ఆరోగ్య, మహిళా సంబంధిత పథకాలను గురించి పిల్లలకు తల్లులకు తెలియజేయాలి అన్ని పిల్లల కోసం చిన్న, చిన్న వినోదాత్మక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు.ఈ సందర్భంగా శంఖవరం అంగన్వాడీ 4 కేంద్రానికి వచ్చిన చిన్నారుల తో ఆప్యాయంగా ముచ్చటించి, వారికి మిఠాయిలు పంపిణీ చేయుట జరిగినది. పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, అంగన్వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కల్పించారు.అలాగే అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన గర్భిణీ స్త్రీలతో ప్రత్యేకంగా మాట్లాడి, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించు కోవడం, వైద్యుల సూచనలను పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల అభివృద్ధి, పోషణ మరియు ఆరోగ్య పరిరక్షణలో నిరంతరం సేవలందిస్తున్న అంగన్వాడీ కార్యకర్త మసా రాజ్యలక్ష్మి ని చిన్నారుల తల్లులు సన్మానించి, ఆమె సేవలను అభినందించారు.




ఆరోగ్యకరమైన తల్లి ఆరోగ్యకరమైన శిశువు ఆరోగ్యకరమైన సమాజం అనే లక్ష్యంతో అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో సీడీపీఓ పి. వెంకట లక్ష్మి , సూపర్వైజర్ బి.వి రజని, శంఖవరం -4 అంగన్వాడీ ఆయా , గర్భిణీ స్త్రీలు, చిన్నారులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గోదావరి డెల్టా పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కృషి





**ముంపు తొలగింపునకు తాత్కాలిక చర్యలు.. 2027లో శాశ్వత పనులు ప్రారంభం: ఎమ్మెల్యే బండారు**

**కొత్తపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 25:** గోదావరి డెల్టా పునర్నిర్మాణం, రైతుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. అర్నాబ్ తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన వరి పొలాలను శుక్రవారం కొత్తపేట మండలం పలివెల రేవడిలో వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుఫాను కారణంగా కొన్ని గ్రామాల్లో పొట్ట దశలో ఉన్న వరి పంటలు నీటమునిగి రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముంపు నీటిని తొలగించేందుకు ప్రభుత్వం తాత్కాలిక చర్యలు చేపడుతోందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గోదావరి డెల్టా పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఎమ్మెల్యే ఆరోపించారు. కాలువల్లో పూడికతీత పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో సాగునీరు, మురుగునీటి పారుదల సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సాగునీటి సంఘాలను ఏర్పాటు చేసి, కాలువలు, మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టిందన్నారు. గోదావరి డెల్టా పరిరక్షణ కోసం పిచ్చుకలంకలో జరిగిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని తాను కోరిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు. డెల్టా పరిరక్షణకు రూ. 3 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారని తెలిపారు. గోదావరి డెల్టా పునర్నిర్మాణానికి సంబంధించి లైడర్ సర్వే చేపట్టి, డీపీఆర్‌ల తయారీ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కాలువల లాకులు, స్లూయిసులు, అండర్‌టన్నెల్స్, కల్వర్టులు, వంతెనలు, మురుగునీటి, సాగునీటి పారుదల వ్యవస్థలను సమగ్రంగా పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రావిటీ ద్వారా రైతులకు సాగునీరు అందేలా వ్యవస్థను పటిష్ఠం చేస్తామన్నారు. 2027లో పునర్నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. సెంట్రల్ డెల్టాలో రెండు లక్షల ఎకరాలు, ఈస్ట్రన్ డెల్టాలో 2.50 లక్షల ఎకరాలు, వెస్ట్రన్ డెల్టాలో 5.60 లక్షల ఎకరాలు కలిపి మొత్తం సుమారు 10 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించి అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. లైడర్ సర్వే ఆధారంగా రూపొందించే డీపీఆర్‌ల ప్రకారం పనులు చేపడతామని తెలిపారు. నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్వయంగా కాలువలను పరిశీలించి సమస్యలు ఉన్న ప్రాంతాల్లో వెంటనే చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సక్రమంగా పనిచేయని కాంట్రాక్టర్లు, అధికారులపై కూడా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గోదావరి డెల్టా పునర్నిర్మాణం పూర్తయ్యే వరకు కొన్ని సమస్యలు ఉండే అవకాశం ఉందని, అయితే రైతులకు ఇబ్బందులు లేకుండా ముంపు నీటిని తొలగించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్పష్టం చేశారు.

## అంగన్వాడీ సేవలపై అవగాహనకు సేవా సంకల్ప్ అభియాన్



**కాజులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 25:** కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామంలోని ధనలక్ష్మీపేట అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉత్సవం--సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ వై. శ్రీదేవి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ కె. రమణికుమారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలను తల్లులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు వివరించడం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు అందరి సహకారం పొందడం ప్రధాన ఉద్దేశమని సూపర్‌వైజర్ తెలిపారు. ప్రభుత్వ సేవలను కేవలం గణాంకాల రూపంలో కాకుండా లబ్ధిదారుల నిజమైన అనుభవాల ద్వారా సమాజానికి తెలియజేయడమే ఈ అభియాన్ లక్ష్యమన్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి అంగన్వాడీ కేంద్రంలో మూడు రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సేవలను సకాలంలో అందిస్తున్న కార్యకర్త పి. సుబ్బయ్యమ్మ, సహాయకురాలు జి. రాణి, ఆశా కార్యకర్త జె. చంద్రకళలను తల్లులు, అధికారులు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## కాజులూరు మండలంలో భారీ వర్షాలు



**1000 ఎకరాల్లో వరి పొలాల్లో నీరు నిల్వ**

**కాజులూరు పెన్ పవర్, సెప్టెంబర్ 25:** అర్నాబ్ తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాజులూరు మండలంలో సుమారు వెయ్యి ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా గుర్తించింది. పంట నష్టంపై మండల వ్యవసాయ అధికారి వి. అశోక్ ప్రాథమిక నివేదిక వెల్లడించారు. గ్రామ వ్యవసాయ సహాయకులతో కలిసి శీలా, శ్రీలంక, కాజులూరు, మంజేరు, పల్లిపాలెం తదితర గ్రామాల్లో పర్యటించి పంట పరిస్థితులను పరిశీలించారు. పొలాల్లో నిలిచిన వరద నీటిని అంతర్గత కాల్వల ద్వారా త్వరితగతిన బయటకు పంపాలని, అధికంగా నీరు నిలిచిన ప్రాంతాల్లో మోటార్లను వినియోగించి తొలగించాలని రైతులకు సూచించారు. నీరు తగ్గిన అనంతరం మాగుడు, మానిపండు తెగుళ్ల నివారణకు ఎకరాకు 200 మిల్లీలీటర్ల ప్రొపికొనజోల్ మందును పిచికారీ చేయాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత బ్యాక్టీరియా ఎండాకు తెగులు కనిపిస్తే లీటరు నీటికి ఒక గ్రాము ప్లాంటోమైసిన్, రెండు గ్రాముల కోసైడ్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తక్కువ సమయంలో విస్తృతంగా మందు పిచికారీ చేసేందుకు అవసరమైన చోట్ల డ్రోన్లను వినియోగించుకోవాలని తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండి వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించి పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి. అశోక్ కోరారు. ఆయన వెంట ఏఎంసీ వైస్ చైర్మన్ దడాల నాగేశ్వరి నాగార్జున, వ్యవసాయ సిబ్బంది, పలువురు రైతులు ఉన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ వారధి

**వాడపాలెంలో 22 వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే బండారు**





**కొత్తపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 25 :** ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం వారధిగా నిలుస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం వాడపాలెంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు, అర్జీలు సమర్పించారు. మొత్తం 22 వినతులు ఎమ్మెల్యేకు అందాయి. ప్రజలు వివరించిన సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా అడిగి తెలుసుకుని, సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడారు. కొన్ని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపించారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రజాప్రతినిధి దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజాదర్బార్ మంచి వేదికగా ఉపయోగపడుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా తీసుకుని పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

## జగ్గంపేటలో 10వ రోజు కొనసాగిన వీఆర్‌ఏల ధర్నా




**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 25:** ఏపీ వీఆర్ఏ జేఏసీ పిలుపు మేరకు తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జగ్గంపేట తహసిల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏలు సహాయ నిరాకరణ ఉద్యమం (సమ్మె) 10వ రోజు శుక్రవారం నిర్వహించారు. గత 8 సంవత్సరాల నుండి వీఆర్‌ఏలకు జీతం ఒక్క రూపాయి కూడా పెరుగుదల లేదన్నారు. నిత్యావసర సరుకు ధరలకు అనుగుణంగా వీఆర్‌ఏలకు రూ. 10,500తో కుటుంబ పోషణ చాలా దుర్భరంగా ఉందని అర్ధకాలితో పస్తులు ఉండవలసిన పరిస్థితి నెలకొందని ఆవేదన చెందారు. పే స్కేలు ఇవ్వాలని, నామిని విఆర్ఏలను రెగ్యులర్ చేయాలని, అర్హత కలిగిన వీఆర్‌ఏలకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో భాగంగా శుక్రవారం జగ్గంపేట సెంటర్ లో గల దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఇస్సాకు, కార్యదర్శి మౌళి, పెద్దాపురం డివిజన్ ఉపాధ్యక్షులు చిట్టిబాబు, మండల జాయింట్ సెక్రటరీ ప్రభావతి, ఉపాధ్యక్షులు కె. అర్జునుడు, మండల విఆర్ఏలు పాల్గొన్నారు.

## శంఖవరం రహదారి మరమ్మత్తులకు 1.50 కోట్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే సత్యప్రభ

- ధన్యవాదాలు తెలిపిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్



**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 25:-** శంఖవరం గ్రామ ప్రజలు గుంతల రహదారితో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను పరిష్కరించేందుకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ డిఎంఎఫ్ నిధుల నుండి 1 కోటి 50 లక్షల రూపాయులను మంజూరు చేయించడంతో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్ ధన్యవాదాలు తెలిపారు. మండల కేంద్రం శంఖవరంలోని సురేష్ గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆర్థిక భారంతో సతమతమం అవుతున్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందే ఉంటుందన్నారు. మన శంఖవరం గ్రామంలో క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే సత్యప్రభకు వివరిస్తుండడంతోనే పలు పనులకు అభివృద్ధి నిధులు మంజూరు చేసి ఆమె చిత్త శుద్ధిని చాటుకుంటుందన్నారు. శంఖవరం గ్రామం మీదుగా వెళ్ళుతున్న టిప్పర్ల సమస్యను తొలగించేందుకు బైపాస్ రహదారి నిర్మాణంపైన ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసి పంపించినట్లు పేర్కొన్నారు. భూ సేకరణకు రైతులు సహకరిస్తే త్వరలోనే ఆ సమస్య పరిష్కారమవుతుందన్నారు. శంఖవరం గ్రామంలో ప్రస్తుతం డిఎంఎఫ్ నిధులతో 590 మీటర్ల మేర గుంతలు పడిన ప్రాంతాల్లో రోడ్డు వేయడం జరుగుతుందన్నారు. సుమారు 7 కోట్ల రూపాయులతో మొత్తం రహదారి నిర్మాణానికి ప్రణాళికలు పంపించగా, ఆర్థిక శాఖలో కూడా ఆమోదం పొందిందన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా బావిస్తూ పనులు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, టిడిపి నేతలు బొర్రా లచ్చబాబు, బైరా శ్రీరామ్మూర్తి, పడాల సతీష్, బొర్రా వాసు, జట్లా శ్రీను, బొర్రా వర ప్రసాద్, రౌతు శ్రీను, బోట్ల లోవరాజు, బందిలి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు మండలంలో 380 ఎకరాలు పంట నీట మునక.

- ప్రత్తిపాడు మండల వ్యవసాయ శాఖ అధికారిణి జోకా అమృత.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్, 25:** గత మూడు రోజులుగా హర్నుబ్ వాయుగుండం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలు వల్ల మండలంలోని ప్రత్తిపాడు, ఏలూరు, ఉత్తరకంచి, శరభవరం గ్రామాల్లో సుమారు 380 ఎకరాలు పంట నీట మునిగినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిణి జోకా అమృత తెలిపారు. నీట మునిగిన పంట పొలాలను మండల వ్యవసాయ అధికారిణి జోకా అమృత శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జోకా అమృత మాట్లాడుతూ రైతులు పొలాల్లో ఉన్న నీటిని కాలువల ద్వారా తొలగించాలని, పొలాన్ని క్రమం తప్పకుండా పరిశీలించి, వీలైనంత తొందరగా నీటిని పూర్తిగా బయటకు తీసివేయాలన్నారు. తెగుళ్లకు పురుగు మందులు పిచికారీ తోపాటు ఎరువుల వేయడం వాయిదా వేయాలన్నారు. వర్షాలు ఆగిన తర్వాత లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం ం మాంకోజెబ్ లేదా 1 మీ.లీ ప్రోపికొనజోల్ మందును పిచికారి చేయాలన్నారు. అంకురం దశలో ఉన్న పైరులో ఎకరాకు 35 కిలోల యూరియాను, 13 కిలోల మ్యురేట్ ఆఫ్ పోటాష్ ను వర్షాల తరువాత నేలలో తేమను చూసుకొని వేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అర్జున్, అగ్రికల్చర్ అసిస్టెంట్ మణికంఠ, వరహాలు పలువురు రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి: కొల్లా శ్రీనివాస్.





**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 25:** విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు కృషి చేయాలని సేవా సంకల్ప అభియాన్ మండల కోఆర్డినేటర్ కొల్లా శ్రీనివాస్ అన్నారు. మండల పరిధి సిరిపురం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వికసిత్ భారత్ లక్ష్యంగా విద్యార్థులలో నైపుణ్య అభివృద్ధిని పెంపొందించేందుకు శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రధానోపాధ్యాయురాలు గంగాభవాని ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వక్రత పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ 25 కోట్ల చిన్నారుల కలలు నెరవేర్చేందుకు వికసిక భారత్ లక్ష్యంగా విద్యార్థులలో నైపుణ్య అభివృద్ధిని పెంపొందించేందుకు దేశవ్యాప్తంగా ప్రయత్నం జరుగుతుందన్నారు. 2047 నాటికి ప్రపంచంలో భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా రూపుదిద్దుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారన్నారు. దీనిలో భాగంగానే విద్యార్థులకు పాఠశాలల్లో వివిధ అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నారు అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు హస్త కళలపై ప్రావీణ్యం పొందాలని, చిత్ర లేఖనం , వకృత్వం పోటీల నిర్వహణ ద్వారా మనోవికాసం పెంపొందించవచ్చని అన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు ధనేకుల వీర భాస్కరం భద్రరావు , జన సేన నాయకులు సాగి వెంకట రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తాళ్లూరు మఠం భూముల వివాదంపై పురావస్తు శాఖ ఉత్తర్వులు

- 2010 నాటి వంశవృక్షం, చారిత్రక నోట్ రద్దు
- తాటాకు పత్రంలో భూముల దానానికి ఆధారాలు లేవని విచారణలో వెల్లడి
- జనార్ధన వరాహ నరసింహమూర్తి తెలిపారు.

**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 26:** తాళ్లూరు వెంకటేశ్వరస్వామి ఆలయం, అర్ఘుగయ మనవాళ్ల జీయర్ స్వామి మఠానికి సంబంధించిన భూముల హక్కుల వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. 2010లో పురావస్తు శాఖ రూపొందించిన చారిత్రక నోట్, వంశవృక్షాన్ని రద్దు చేస్తూ ఆ శాఖ కమిషనర్ ముత్యాలరాజు రేవు ఈ నెల 11న ఉత్తర్వులు జారీ చేసినట్లు మఠం వంశపారంపర్య మఠాధిపతి జనార్ధన వరాహ నరసింహమూర్తి తెలిపారు.తాళ్లూరు మఠం, దేవుని మాన్యాలకు సంబంధించిన భూములపై హక్కులు పొందేందుకు కొందరు తప్పుడు ఆధారాలను సృష్టించారన్న ఆరోపణలపై 2017 నుంచి తాను చట్టపరంగా పోరాడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాలు, చారిత్రక ఆధారాలను ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై 2024 నవంబర్ 20న తాళ్లూరులో నిర్వహించిన బహిరంగ విచారణలో పలు అంశాలు వెలుగులోకి వచ్చినట్లు ఆయన వెల్లడించారు. కేంద్ర పురావస్తు శాఖకు చెందిన చెన్నై శాసన విభాగం పరిశీలనలో తాటాకు పత్రం రెడ్డి రాజుల కాలానికి చెందినది కాదని, 19 లేదా 20వ శతాబ్దానికి చెందినదిగా గుర్తించినట్లు తెలిపారు. ఆ పత్రంలో ఒక వ్యక్తికి ఆలయ పూజా విధులు అప్పగించిన అంశం మాత్రమే ఉందని, భూముల దానం లేదా వంశవృక్షానికి సంబంధించిన ప్రస్తావన లేదని పేర్కొన్నారు.అలాగే రామానుజాచార్యుల కాలానికి సంబంధించి గత నివేదికలో నమోదైన వివరాల్లోనూ చారిత్రక తప్పిదాలు ఉన్నట్లు విచారణలో తేలినట్లు నరసింహమూర్తి తెలిపారు. ఈ అంశాల ఆధారంగా 2010 నాటి వంశవృక్షం, చారిత్రక నోట్‌ను పురావస్తు శాఖ కమిషనర్ రద్దు చేశారని చెప్పారు.ఆ నివేదిక ఆధారంగా జరిగినట్లు పేర్కొంటున్న హక్కుల మార్పిడి, ఇతర మార్పులు, రిజిస్ట్రేషన్లకు చట్టబద్ధత లేదని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు నరసింహమూర్తి తెలిపారు. ఈ ఉత్తర్వులను దేవాదాయ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న 59/2011 కేసులో ఆధారాలుగా సమర్పించనున్నట్లు చెప్పారు.

కాగా, పురావస్తు శాఖ ఉత్తర్వులు వెలువడిన నేపథ్యంలో తాళ్లూరు ఆలయం, మఠం ఆస్తుల హక్కులపై కొనసాగుతున్న వివాదానికి ఇది కీలక పరిణామమని మఠం వర్గాలు పేర్కొన్నాయి. ఈ వ్యవహారంపై తుది నిర్ణయం సంబంధిత న్యాయస్థానం పరిధిలో ఉంటుందని వారు తెలిపారు.



## నీట మునిగిన వరి పొలాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 25**: జగ్గంపేట మండలంలో కాట్రావులపల్లి, సీతానగరం, జగ్గంపేట గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను శుక్రవారం జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు వి.టి. రామారావు సందర్శించారు. రైతులు తమ యొక్క వరి పొలాలను నీరు తగ్గిన తర్వాత ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని లేదా పొటాషియం స్ప్రే చేసినట్లయితే కొంతవరకు మనం పంటను రక్షించుకోవచ్చని సూచించారు. అంతేకాక పూర్తిగా నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందేలా చూస్తామని దానికి తగు ప్రణాళికను సిద్ధం చేసి రెండు మూడు రోజుల్లో కమిటీలను వేసి త్వరితగతిన తుది జాబితాను ప్రభుత్వానికి చేరేలా చేస్తామన్నారు. ఇప్పటివరకు 2360 ఎకరాల్లో పంట నీటి ముంపుకు గురైనట్లు అంచనా వేయడం జరిగిందని జగ్గంపేట మండల వ్యవసాయ అధికారి ఎస్.నరసింహం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు చంద్రమౌళి, బలరాం, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్ తో ప్రజాసమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని జగ్గంపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు, టిడిపి పోలీట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ తెలిపారు. జగ్గంపేట రావులమ్మ నగర్ లోని క్యాంప్ ఆఫీసులో శుక్రవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు పెన్షన్లు, హౌసింగ్ లోన్లు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలపై ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించారు. గోకవరం మండలం గుమ్మలదొడ్డి గ్రామానికి చెందిన ఆడారి ఆదిలక్ష్మి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు వైద్యం చేయించుకుని ముఖ్యమంత్రి సహాయనిధి కోసం ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేశారు. సంబంధించిన ఫైల్స్ ముఖ్యమంత్రి కార్యాలయానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తీసుకొని వెళ్లడం జరుగుతుంది అన్నారు. కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మిగిలిన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను నిరంతరం అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, ఏపీ స్టేట్ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, బుర్రి సత్తిబాబు, నీలం శ్రీను, రేఖ బుల్లి రాజు, పాండ్రంగి రాంబాబు, రాయి సాయి, మారిశెట్టి రాధా, సాంబత్తుల చంద్రశేఖర్, జనసేన ఎంపీటీసీ దొడ్డ శ్రీను, వేగి సత్తిబాబు, పోట్రు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## టిడ్కో గృహాలు మంజూరు కాని లబ్ధిదారులకు సొమ్ము వాపస్

- ఎనిమిది మందికి రూ.8 లక్షల చెక్కులు అందజేత
- మంత్రి వాసంశెట్టి సుభాష్





**రామచంద్రపురం, పెన్ పవర్, సెప్టెంబర్ 25 :**రామచంద్రపురం పట్టణంలోని టిడ్కో గృహ సముదాయంలో వివిధ కారణాలతో గృహాలు మంజూరు కాని లబ్ధిదారులకు ప్రభుత్వం వారు గతంలో చెల్లించిన సొమ్మును తిరిగి అందజేస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఎనిమిది మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.8 లక్షలను మంత్రి వాసంశెట్టి సుభాష్ చెక్కుల రూపంలో అందజేశారు.మంత్రి వాసంశెట్టి సుభాష్, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్. రాజు, టిడ్కో సిఎల్‌టిసి బిందు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవల్లి శివ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, టిడ్కో గృహాల కేటాయింపులో సాంకేతిక కారణాలతో కొంతమంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు కాలేదని తెలిపారు. అటువంటి లబ్ధిదారులు గతంలో చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. లబ్ధిదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో క్లస్టర్-2 ఇన్‌చార్జి కంచుమర్తి బాబురావు, పడాల బాబి, బన్ను, లబ్ధిదారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాత, శిశు సంరక్షణకు అభ్యున్నతికి కృషి



**ఐసీడీఎస్ సీడీపీఓ గజలక్ష్మి పిలుపు**

**ఆలమూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 25:**మాత, శిశు సంరక్షణకు, అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి అన్నారు.మండలంలోని గుమ్మిలేరులో శుక్రవారం అంగన్వాడీ ఉత్సవ్ పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. చొప్పెల్ల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి ఎన్.లక్ష్మీస్నేహ, ఐసీడీఎస్ సూపర్వైజర్ కె.నాగ సత్యవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ,అంగన్వాడీ సిబ్బంది, బాలింతలు, గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ తన 25 యేళ్ల రాజకీయ ప్రజాసేవను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత, శిశువుల కోసం ప్రవేశ పెట్టిన ఎనిమిది పథకాలు, పౌష్టికాహారం గురించి వివరించారు. చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని, పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అందిస్తున్న సేవలను వివరిస్తూ బారీ ర్యాలీ నిర్వహించారు.

## భారీ వర్షాలకు జలమయమైన సామర్లకోట మండలం

**అచ్చంపేట, ఆర్.చంద్రంపాలెంలో రంగంలోకి యంత్రాలు.. నీటి తొలగింపునకు చర్యలు**





**కాకినాడ/సామర్లకోట, పెన్ పవర్ సెప్టెంబర్ 25** :ఆర్నబ్ తుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సామర్లకోట రూరల్ మండలంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. అచ్చంపేట గ్రామంలోని ప్రజావాస ప్రాంతాలు, ఆర్.చంద్రంపాలెం గ్రామంలోని వరి పంట పొలాలు నీటమునిగాయి. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులతో కలిసి ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు.ఈ సందర్భంగా సామర్లకోట మండల తహసీల్దార్,మండల వ్యవసాయ అధికారి,ఇరిగేషన్,డ్రైనేజీ శాఖల అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. ప్రజావాస ప్రాంతాలు, పంట పొలాల్లో నిలిచిన నీటిని త్వరితగతిన తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జేసీబీలు, ఎక్స్‌కవేటర్లను రంగంలోకి దించి కాలువలు,డ్రైనేజీ మార్గాల్లో పేరుకుపోయిన మట్టి,చెత్తాచెదారం, ఇతర అడ్డంకులను తొలగించారు. దీంతో అచ్చంపేటలోని ప్రజావాస ప్రాంతాలు,ఆర్.చంద్రంపాలెంలోని వరి పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపించేందుకు చర్యలు వేగవంతం చేశారు. రైతులకు పంట నష్టం కలగకుండా, పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా ఇరిగేషన్, డ్రైనేజీ, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రంగనాగ్ సూచించారు.తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా,పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా అన్ని చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఈ పర్యటనలో సామర్లకోట మండల టీడీపీ అధ్యక్షులు మునిరెడ్డి శ్రీరాములు, అడ్డాల వెంకన్నబాబు,దమ్మాల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ షాపుల లైసెన్సుల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**తూర్పుగోదావరి జిల్లాలో 2026--27 ఎక్సైజ్ పాలసీప్రకారం దేశంలో తయారైన విదేశీ మద్యం విదేశీ మద్యం షాపుల లైసెన్సుల మంజూరుకు ప్రభుత్వం దరఖాస్తుల కోరుతోందని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారి శ్రీలత తెలిపారు. కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ నిబంధనలు 5 ప్రకారం లాటరీ ద్వారా లైసెన్సు దారుల ఎంపిక జరుగుతుందన్నారు.

2024 లో జిల్లాలో 159 లైసెన్స్ షాపులు ఉన్నాయని, వాటిలో 155 షాపులు పునరుద్ధించు కోవడం జరిగిందన్నారు. జిల్లాలో 4 ఎక్సైజ్ షాపులకు లైసెన్సులు కొత్త గా మంజూరు చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఇంతవరకు మద్యం అమ్మకాల ద్వారా జిల్లాలో రూ. 34.75 కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. తిరిగి చెల్లించబడని దరఖాస్తు రుసుము వార్షిక పర్మిట్ రూమ్ బిక్కవోలు (మం.), కడియం (మం.) కొవ్వూరు (మం.) మండపేట రూరల్ (మం.) షాపులకు లైసెన్సు కాల 01-10-2026 నుండి 30-09-2027వరకు ఉంటుందన్నారు.

ఒక్కొక్క షాపుకు మూడు లక్షల నుంచి ఏడున్నర లక్షల వరకు లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంద న్నారు. దరఖాస్తుల ఆసక్తి ఉన్న వారు దరఖాస్తుదారులను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో 01-10-2026 రాత్రి 12.00 గంటల వరకు దరఖాస్తులు సమర్పించ వచ్చునన్నారు.ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్/హైబ్రిడ్ విధానంలో దరఖాస్తు రుసుము రూ. 3,00,000/- ప్రాసెసింగ్ ఫీజు రూ.1,000/- , మొత్తం రూ. 3,01,000/- చెల్లించాలన్నారు.దరఖాస్తులను జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయం, .రాజమహేంద్రవరం నగరంలోని నార్త్ ఎక్సైజ్ స్టేషన్, సౌత్ ఎక్సైజ్ స్టేషన్, కోరుకొండ, రంగంపేట, కొవ్వూరు, దేవరపల్లి, నిడదవోలు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ లలో అందించాలన్నారు. ప్రతి షాపుకు కనీసం 4 దరఖాస్తులు అందినప్పుడే ఎంపిక ప్రక్రియ చేపడతామన్నారు. నాలుగు లేదా అంతకంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లయితే, జిల్లా కలెక్టర్ , జిల్లా మేజిస్ట్రేట్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో వచ్చేనెల 5వ తేదీన ఉదయం 8 గంటలకు లాటరీ తీస్తామన్నారు . దరఖాస్తుదారులు హాజరుకాకపోయినా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.

దరఖాస్తుదారులు తమ ఆన్లైన్ సిస్టమ్ జనరేటెడ్ తప్పనిసరిగా తీసుకు రావాలన్నారు.

**బెల్ట్ షాపులు, రూ.10 వసుళ్ళు పై కఠిన చర్యలు...**

నగరంలో బెల్ట్ షాపులు, మద్యం షాపుల్లో అక్రమంగా ఎమ్మార్పీ ధరల కన్నా పది రూపాయలు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందుతున్నాయని అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీలత హెచ్చరించారు. కచ్చితంగా పర్మెంటు షాపుల్లోనే మద్యం సేవించే లా చూడాలని, ఓపెన్ డ్రింకింగ్ చేసే వారి పైన, దుకాణం దారుల పైన కూడా చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ సమావేశంలో ఏ ఈ ఎస్ శ్రీనివాసరావు, సి ఐ హనుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం



**డి ఎమ్ హెచ్ వో డా పి.కోమలి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబరు 25:**ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసీ సిబ్బంది అందిస్తున్న సేవలు అత్యంత కీలకమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. కోమలి అన్నారు. ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా ఫార్మసీ అధికారులు, సిబ్బందిని అభినందిం చారు. శుక్రవారం స్థానిక డి ఎమ్ హెచ్ వో కార్యాలయం లో అసోసియేషన్ ప్రతినిధులు కలవడం జరిగింది.ఈ సందర్భంగా డా పి కోమలి మాట్లాడుతూ, అత్యవసర ప్రాణరక్షక మందులు, టీకాలను నిర్దేశిత ఉష్ణోగ్రతల్లో భద్రపరచడంతో పాటు మందుల నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ, మందుల కొరత లేకుండా చూడటంలో ఫార్మసీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గడువు తీరిన, నాసిరకం మందులను గుర్తించి సురక్షితంగా తొలగించడం ద్వారా రోగుల భద్రతకు భరోసా కల్పిస్తున్నారని పేర్కొన్నారు.డాక్టర్లు సూచించిన మందులను నిర్ణీత సమయానికి, సరైన మోతాదులో వినియో గించేలా రోగులకు అవగాహన కల్పించడం, వైద్యుల సలహా లేకుండా సొంతంగా మందులు వినియోగించకుండా ప్రజలను చైతన్యపరచడం ఫార్మసిస్టుల బాధ్యతల్లో ముఖ్యమైనవని డాక్టర్ కోమలి తెలిపారు. మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా మందులు వినియోగించేలా ప్రోత్సహించడంతో పాటు, యాంటీబయాటిక్స్ దుర్వినియోగాన్ని అరికట్టడంలోనూ ఫార్మసిస్టులు చేస్తున్న కృషి అభినందనీయ మన్నారు. జిల్లా ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు అహర్నిశలు సేవలందిస్తున్న ఫార్మసీ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిని కలిసిన ఫార్మసీ అధికారులు సత్యనారాయణ, రాజేశ్, జైలుద్దీన్, మూర్తి, పాపారాయుడు తదితరులు ఉన్నారు.

# ఏలేశ్వరం మండలంలో 950 ఎకరాలకు పైగా పంట ముంపు.





**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**తుఫాను ప్రభావంతో మండలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో పంట పొలాలు నీటమునిగాయని మండల వ్యవసాయాధికారి ఎ.వి . రాజేష్ శుక్రవారం ప్రకటించారు. మండలవ్యాప్తంగా సుమారు 950 ఎకరాలకు పైగా పంటలు ముంపునకు గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు. యర్రవరం గ్రామంలో భారీ వర్షాలకు నీటమునిగిన వరి పొలాలను మండల తహసీల్దార్ కె. కీర్తి, మండల వ్యవసాయ అధికారి ఎ.వి. రాజేష్ లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల పరిస్థితిని సమీక్షించి, నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేశారు. రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం, అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారని భరోసా ఇచ్చారు. ముంపునకు గురైన వరి పొలాల్లో నిలిచిన అదనపు నీటిని అంతర్గత కాలువల ద్వారా వీలైనంత త్వరగా బయటకు పంపించాలని అధికారులు రైతులకు సూచించారు. నీటిని పూర్తిగా తొలగించిన అనంతరం పైరు కోలుకునేందుకు ఎకరాకు 20--25 కిలోల యూరియా, 10--15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలని సూచించారు. వేర్లు దెబ్బతిని భూమి నుంచి ఎరువులను తీసుకునే పరిస్థితి లేనప్పుడు తక్షణ పోషణ కోసం 19:19:19 లేదా యూరియా 10 గ్రాములు/లీటరు నీటికి కలిపి ఆకులపై పిచికారీ చేయాలని పేర్కొన్నారు.వర్షాలు తగ్గిన అనంతరం అధిక తేమ కారణంగా మాగుడు తెగులు సోకకుండా ఎకరాకు 200 మి.లీ. ప్రొపికొనజోల్ పిచికారీ చేయాలని అధికారులు సూచించారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులు (దీుదీ) లక్షణాలు కనిపిస్తే ప్లాంటోమైసిన్ 1 మి.లీ./లీటరు ం కొసైడ్ (కాపర్ హైడ్రాక్సైడ్) 2 గ్రాములు/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.నేల తడిగా ఉండి మనుషులు పొలాల్లోకి వెళ్లలేని పరిస్థితుల్లో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మందులు పిచికారీ చేసేందుకు అందుబాటులో ఉన్న డ్రోన్ సాంకేతికతను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.

**ఉద్యాన పంటలకు యాజమాన్య పద్ధతులు పాటించాలి: హార్టికల్చర్ అధికారిణి దివ్యశ్రీ.**

తుఫాను ప్రభావంతో మండలంలో విస్తారంగా కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ఉద్యాన పంటలను మండల ఉద్యాన శాఖ అధికారి కె. దివ్యశ్రీ పరిశీలించారు. ఉద్యాన శాఖ అధికారుల ఆధ్వర్యంలో యర్రవరం, పేరవరం, తీరుమాలి, లింగంపర్తి, బద్రవరం తదితర గ్రామాల్లో రైతులతో కలిసి పంటలను క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఉద్యాన రైతులకు పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కూరగాయ పంటల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించాలని, పడిపోయిన మొక్కలను తిరిగి నిలబెట్టి మట్టి ఎత్తి ఆసరా కల్పించాలని సూచించారు. విరిగిన కొమ్మలు, కుళ్లిన ఆకులు, కాయలను తొలగించాలని తెలిపారు. ఆకుమచ్చ, కుళ్లు తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వేరుకుళ్లు నివారణకు బ్లిటాక్స్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ల వద్ద పోయాలని తెలిపారు.అరటి తోటల్లో వంగిన మొక్కలకు ప్రాపింగ్ చేసి, దెబ్బతిన్న భాగాలను తొలగించాలని సూచించారు. సిగటకా, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.బొప్పాయి తోటల్లో నీరు నిల్వకుండా డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని, కుళ్లిన భాగాలను తొలగించాలని సూచించారు. కుళ్లు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి వినియోగించాలని తెలిపారు.జామ తోటల్లో కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటరు నీటికి కలిపి వినియోగించాలని సూచించారు. ఆయిల్‌పామ్, కొబ్బరి తోటల్లో పాదులు చేసి ఎరువులు వేయాలని తెలిపారు. మొవ్వు కుళ్లు సోకినప్పుడు కుళ్లిన భాగాలను తొలగించి కార్బెండజిమ్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి వినియోగించాలని రైతులకు సూచించారు.భారీ వర్షాల అనంతరం పంటల్లో తెగుళ్లు, కుళ్లు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఉద్యాన శాఖ అధికారులు సూచించిన యాజమాన్య పద్ధతులను పాటించి పంటలను సంరక్షించుకోవాలని హెచ్ఓ దివ్యశ్రీ కోరారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 25 :**విద్యార్థులు విద్యతో పాటు సామాజిక స్పృహను అలవర్చుకుని, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సలహా మండలి సభ్యులు డాక్టర్ మానికిరెడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ మానికిరెడ్డి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత మహాత్మా గాంధీ, స్వామి వివేకానంద చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ విద్యార్థి యువత తలచుకుంటే ఎలాంటి కార్యక్రమాలనైనా సమర్థవంతంగా నిర్వహించగలరని అన్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాల సాధన, యూనివర్సిటీ పీజీ ర్యాంకులు, సేవా కార్యక్రమాల నిర్వహణలో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ముందుంటున్నారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులు జీవన నైపుణ్యాలు,నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ముఖ్య అతిథి డాక్టర్ మానికిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ మహాత్మా గాంధీ,స్వామి వివేకానందలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ రోజువారీ కార్యక్రమాలు, ప్రత్యేక సేవా శిబిరాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదపడతాయని వివరించారు. రక్తదానం, సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములై,సమాజ సేవకు కొంత సమయాన్ని కేటాయించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సంస్థ తరపున ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులను ఘనంగా సత్కరించారు. కళాశాలలో సేవలందిస్తున్న అటెండర్లు, ఆయాలకు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్.నాయుడు చేతుల మీదుగా వస్త్రాలను పంపిణీ చేశారు.

ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించిన బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సి. సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు టి. తేజేశ్వరరావు, డి. అశ్విని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## కాకినాడ రూరల్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీలతో సమావేశం

- 4,124 మంది ఓటర్లకు నోటీసులు.. 9 మంది ఓటర్ల తొలగింపు
- ఆర్డీవో ఎస్. మల్లిబాబు వెల్లడి



**కాకినాడ, పెన్ పవర్ సెప్టెంబర్ 25 :**కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటర్ల ముసాయిదా జాబితా, ఓటర్ల నమోదు, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణకు సంబంధించి ఆర్డీవో ఎస్. మల్లిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్డీవో మల్లిబాబు మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ నాటికి కాకినాడ రూరల్ నియోజకవర్గంలో మొత్తం 2,23,091 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఓటర్ల సర్వే ప్రక్రియలో భాగంగా 4,124 మందికి నోటీసులు జారీ చేయగా, 9 మంది ఓటర్లను తొలగించినట్లు వెల్లడించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పోలింగ్ స్టేషన్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను కూడా చేపట్టినట్లు వివరించారు.ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండేలా ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నుంచి కే. శ్రీనివాస్, బీజేపీ నుంచి కే. విజయ రాఘవరావు, కృష్ణమోహన్, టీడీపీ నుంచి సతీష్,వైసీపీ నుంచి రావూరి వెంకటేశ్వరరావు,ఆప్ నుంచి నాగేశ్వరరావు,సీపీఐ నుంచి శ్రీనివాస్, జనసేన పార్టీ నుంచి సతీష్ తదితరులు పాల్గొన్నారు.అలాగే రూరల్ తహసీల్దార్ పోతురాజు,డిప్యూటీ తహసీల్దార్లు ప్రసాదు,సురేష్, ఇతర రెవెన్యూ సిబ్బంది హాజరయ్యారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి.

-నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యప్రభరాజా





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్, 25:** విద్యార్థుల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరపుల సత్య ప్రభరాజా అన్నారు.జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు పంపిణీ చేసారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 40 అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వైద్యాధికారిణి డాక్టర్ కె. ఉషశ్రీ తెలిపారు.పాఠశాలలకు శుక్రవారం స్థానిక సెలవు కావడంతో పాఠశాల, కళాశాల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు ఈ కార్యక్రమంలో వేయలేకపోయామని, అక్టోబర్ 5 న నిర్వహించే మాప్‌అప్ రౌండ్‌లో విద్యార్థులకు మాత్రలు అందజేస్తామని డాక్టర్ కె. ఉషశ్రీ తెలిపారు.ఈ కార్యక్రమంలోనాయకులు కొమ్ముల కన్నబాబు యాళ్ల జగదీష్, జ్యోతుల పెదబాబు, మంతెన వెంకటరమణ, ఇళ్ల అప్పారావు,అమరాది వెంకట్రావు, సింగిలిదేవి సత్తిరాజు, మదినే దొరబాబు, రావూరి తాతాజీ, యర్రాబత్తుల గోవిందనాయుడు, వెలుగుల నాని, చెలంకూరి భాను, పోలిశెట్టి శీను, మదినే స్వామి, ముత్యాల రాంబాబు,పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షాలు అనంతర పరిస్థితులపై సమీక్ష సమావేశం



**గండేపల్లి, పెన్ పవర్ , సెప్టెంబర్, 25:**తుఫాను ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల అనంతరపరిస్థితులపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం లో ఎంపీడీఓ హరికృష్ణ సత్య రెడ్డి, ఎస్సై యువి శివ నాగబాబు, తాసిల్దార్ కె పద్మజ, ఏవో కె చందర్రావు పంచాయతీ అభివృద్ధి అధికారులకు వీఆర్వోలకు టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉన్నాయని దానిపై అడిగి తెలుసుకున్నారు. వర్షాలు అనంతరశీ తీసుకోవలసిన పారిశుధ్య చర్యలు మొదలగు విషయాలు తెలియజేయదమైనది. ఎంపీడీఓ, గండేపల్లి

## ఖరీఫ్ ధాన్యం సేకరణకు పటిష్ట కార్యాచరణ



- రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలి
- జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్
- కాకినాడ జిల్లాలో 4.88 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 25 :**ఖరీఫ్ 2026-27 సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన శుక్రవారం అమరావతి నుంచి నిర్వహించిన రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో కాకినాడ కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పాల్గొన్నారు. ఖరీఫ్ 2026-27 ధాన్యం సేకరణ ఏర్పాట్లపై నిర్వహించిన ఈ సమీక్షలో జిల్లాల వారీగా దిగుబడి అంచనాలు, సేకరణ లక్ష్యాలు, రైతు సేవా కేంద్రాల పరిధిలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గోదాముల లభ్యత, రవాణా సదుపాయాలపై చర్చించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో వరి ఆయకట్టు విస్తీర్ణం 90,336 హెక్టార్లు కాగా, ప్రస్తుత ఖరీఫ్‌లో 82,822 హెక్టార్లలో వరి సాగు చేసినట్లు తెలిపారు. ఈ సీజన్‌లో 5,74,619 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక వినియోగానికి పోగా మిగిలిన 4,88,426 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉందని పేర్కొన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. తేమ శాతాన్ని కొలిచే యంత్రాలు, తూనిక యంత్రాలు, అవసరమైన మేరకు గోనె సంచులు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం సేకరణ జరగాలని స్పష్టం చేశారు.

**రైతులకు సకాలంలో చెల్లింపులు**

ధాన్యం విక్రయించిన రైతులకు నగదు చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా నిర్ణీత వ్యవధిలో వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమ అయ్యేలా పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయి అధికారులు, తహశీల్దార్లు నిరంతరం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తూ రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు.

ధాన్యం సేకరణలో డిజిటల్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుల వరకు ధాన్యం రవాణాను ట్రాకింగ్ చేసే విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. రాష్ట్రస్థాయి సమావేశంలో జారీ చేసిన మార్గదర్శకాలను కాకినాడ జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేసి, రైతు సంక్షేమమే ధ్యేయంగా ఖరీఫ్ ధాన్యం సేకరణను విజయవంతం చేయాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి రామారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆసియా క్రీడల్లో గుల్వీర్ సింగ్ సత్తా.. 10,000 మీటర్లలో సిల్వర్ మెడల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ గుల్వీర్ సింగ్ మరోసారి తన సత్తా ఏంటో ప్రపంచానికి చాటి చెప్పారు. 2026 ఆసియా క్రీడలలో పురుషుల 10,000 మీటర్ల ఫైనల్స్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ హోరాహోరీ రేసును ఆయన కేవలం 28:29.38 నిమిషాల టైమింగ్‌తో పూర్తి చేసి ట్రెండింగ్‌లో నిలిచారు.

**గుల్వీర్ సక్సెస్ జర్నీ:**
అంతర్జాతీయ వేదికలపై గుల్వీర్ సింగ్ తన పరుగుతో తిరుగులేదని నిరూపిస్తున్నారు. ఈ తాజా గెలుపుతో ఆయన తన కెరీర్‌లో మరో భారీ అంతర్జాతీయ పతకాన్ని జమ చేసుకున్నారు. సరిగ్గా చెప్పాలంటే, గతంలో 2023లో జరిగిన హాంగ్జౌ ఏషియన్ గేమ్స్‌లోనూ అతడు కాంస్య పతకం సాధించి అదరగొట్టారు.

**గుల్వీర్ సింగ్ పతకాలు:**
ఇటీవలే ముగిసిన 2026 కామన్వెల్త్ గేమ్స్‌లోనూ గుల్వీర్ అదరగొట్టారు. అక్కడ 27:49.78 సమయంలో రేసును పూర్తి చేసి రజత పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఇక రికార్డుల విషయానికి వస్తే.. 2025లో ఏకంగా 27:00.22 సమయంలో లక్ష్యాన్ని చేరుకుని జాతీయ 10,000 మీటర్ల రికార్డును తన పేరిట లిఖించుకున్నారు. అంతకంటే ముందు గత ఏడాదే ఏషియన్ టైటిల్‌ను కూడా కైవసం చేసుకున్నారు. దీంతో ఆసియా ఖండంలోనే టాప్ డిస్టెన్స్ రన్నర్లలో ఒకరిగా తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు.

**ఇండియన్ అథ్లెటిక్స్ గర్వించదగ్గ స్టార్:**
అంతర్జాతీయ గేమ్స్ లో వరుస విజయాలతో దూసుకుపోతున్న గుల్వీర్ సింగ్, ఈ ఆసియా క్రీడలలోనూ తన సూపర్ ఫామ్‌ను కంటిన్యూ చేశారు. ఈ తాజా పోడియం ఫినిష్‌తో అతడు అంతర్జాతీయ వేదికలపై భారత్ కీర్తిని మరో మెట్టు ఎక్కించారు.

# భారత్ 2027 వరల్డ్ కప్ ప్లాన్ ఇదేనా? రోహిత్, కోహ్లీపై గంభీర్ వ్యాఖ్యలు వైరల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్‌తో త్వరలో జరగనున్న 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల రూపంలో అత్యంత అనుభవజ్ఞులైన ఆటగాళ్ల అండ లభిస్తోందని ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పేర్కొన్నారు. గతేడాది వన్డే కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన గిల్ నాయకత్వానికి ఈ సీనియర్ల అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

**గంభీర్ ప్రశంసలు - కోహ్లీ, రోహిత్ పాత్ర:**
జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కోచ్ గంభీర్ మాట్లాడుతూ.. వన్డే క్రికెట్‌లో రోహిత్, విరాట్ లాంటి దిగ్గజాలు మైదానంలోనూ, మైదానం బయట గిల్‌కు సహాయపడే స్థితిలో ఉండటం అతడు చేసుకున్న అదృష్టమని వెల్లడించారు. ముఖ్యంగా యువ వయసులో ఉద్వేగాలకు లోనయ్యే ఛాన్స్ ఉంటుందని, కానీ గిల్ భావోద్వేగాలను పక్కన పెట్టి ప్రశాంతంగా వ్యవహరిస్తున్నాడని గౌతమ్ గంభీర్ కొనియాడారు.

**గిల్ లీడర్‌షిప్ స్టైల్ పై కోచ్ అంచనాలు:**
26 ఏళ్ల శుభ్‌మన్ గిల్ తన నాయకత్వ లక్షణాలతో అన్ని విభాగాల్లోనూ అద్భుతంగా రాణిస్తున్నాడని గౌతమ్ గంభీర్ ప్రశంసించారు. గిల్ ఎంతో ప్రశాంతంగా, నిస్వార్థంగా, దూకుడుగా వ్యవహరిస్తూ కేవలం పరుగులతోనే కాకుండా తన ఆచరణ ద్వారా జట్టుకు ఆదర్శంగా నిలుస్తున్నాడని పేర్కొన్నాడు. వన్డే క్రికెట్‌లో గిల్‌కు ఇటీవలి కాలంలో కొంత కష్టకాలం ఎదురైనప్పటికీ, అతడు సరైన మార్గంలోనే పయనిస్తున్నందున త్వరలోనే మెరుగైన ఫలితాలు వస్తాయని గంభీర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

**భారత్ వర్సెస్ వెస్టిండీస్ సిరీస్ షెడ్యూల్:**
ఈ సిరీస్‌లో భాగంగా తొలి వన్డే సెప్టెంబర్ 27వ తేదీన తిరువనంతపురంలోని గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరగనుంది. రెండో వన్డే సెప్టెంబర్ 30న గువహటిలోనూ, మూడో వన్డే అక్టోబర్ 3న న్యూ చండీగఢ్‌లోనూ నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆ తర్వాత ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరగనుండగా, అది అక్టోబర్ 17వ తేదీన బెంగళూరులో ముగుస్తుంది. ఈ జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలతో పాటు వైస్ కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ కూడా కొనసాగుతున్నారు.

**వెస్టిండీస్‌పై గిల్ అద్భుత రికార్డు:**
వెస్టిండీస్ జట్టుపై శుభ్‌మన్ గిల్‌కు అద్భుతమైన రికార్డు ఉంది. విండీస్‌పై ఇప్పటి వరకు 6 వన్డే మ్యాచ్‌లు ఆడిన గిల్ 66.2 సగటుతో, 92.71 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 331 పరుగులు సాధించారు. ఇందులో అతని అత్యధిక వ్యక్తిగత స్కోరు 98 పరుగులు.. సీనియర్ ఆటగాళ్ల అనుభవాన్ని అందిపుచ్చుకుంటూ గిల్ తన కెప్టెన్సీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించనున్నారు.

## 66 -- 28తో థాయ్‌లాండ్ చిత్తు.. ఆసియా గేమ్స్ కబడ్డీ ఫైనల్‌లోకి టీమిండియా!

**హైదరాబాద్ పెన్ పవర్:** పాన్‌లోని ఐచి-నగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలు కబడ్డీ టోర్నమెంట్‌లో భారత పురుషుల జట్టు కిరాక్ ప్రదర్శనతో చెలరేగింది. టోకై సిటిజన్స్ జిమ్నాసియంలో జరిగిన ఉత్కంఠభరితమైన సెమీఫైనల్ పోరులో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 66--28 తేడాతో థాయిలాండ్‌ను చిత్తు చేసి ఫైనల్‌లోకి దూసుకెళ్లింది.

**ఆరంభం నుంచే ఆధిపత్యం:**
గ్రూప్-ఏ లో అన్ని మ్యాచ్‌లు గెలిచి అగ్రస్థానంతో సెమీస్‌లోకి అడుగుపెట్టిన భారత జట్టు, నాకౌట్ దశలో ఎలాంటి తడబాటు లేకుండా ఆడింది. ఇండియన్ డిఫెన్స్ విభాగంలో జైదీప్ దహియా, సుమిత్, రాహుల్ సేథ్‌పాల్, కెప్టెన్ సునీల్ కుమార్ అద్భుతంగా ఆడాడు. ఎనిమిది సార్లు ఆసియా క్రీడల కబడ్డీ చాంపియన్‌గా నిలిచిన భారత్, మ్యాచ్ ప్రారంభమైన మొదటి 5 నిమిషాల వ్యవధిలోనే థాయిలాండ్‌ను తొలిసారి ఆల్‌ఔట్ చేసి పూర్తి ఆధిక్యాన్ని సంపాదించింది.

**థాయిలాండ్ ప్రతిఘటన - భారత రెయిడర్ల జోరు:**
మొదటి ఎదురుదెబ్బ నుంచి థాయిలాండ్ జట్టు మెల్లగా కోలుకుంది. థాయిలాండ్ ప్లేయర్ ధీరడెట్ చైసిత్ కొన్ని సంచనాత్మక సూపర్ రెయిడ్స్‌తో పాటు వరుస సక్సెస్‌ఫుల్ రెయిడ్స్‌తో విరుచుకుపడ్డాడు. ఆశ్చర్యకరంగా భారత్‌ను ఆల్- ఔట్ చేసి స్కోరును 24-14 కు తగ్గించాడు. కానీ, భారత రెయిడర్ దేవంక్ దలాల్ అద్భుతమైన ప్రదర్శనతో విజృంభించారు. మొదటి హాఫ్ ముగిసేసరికి భారత్ 37--18 ఆధిక్యంలో నిలిచింది.

**సెకండ్ హాఫ్ లోనూ తగ్గని జోరు:**
రెండో అర్ధభాగంలోనూ మ్యాచ్‌పై భారత జట్టు పూర్తి నియంత్రణ సాధించింది. థాయిలాండ్ తరఫున చైసిత్ ఒంటరి పోరాటం చేసినప్పటికీ, టీమిండియా వ్యూహాత్మకంగా ఆడుతూ మరో రెండుసార్లు థాయిలాండ్‌ను ఆల్- ఔట్ చేసింది. చివరికి 66-28 భారీ స్కోరుతో ఘన విజయం సాధించి ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది.

**స్వర్ణ పతక పోరుకు సర్వం సిద్ధం:**
(సెప్టెంబర్ 26, శనివారం) జరిగే ఏషియన్ గేమ్స్ 2026 కబడ్డీ స్వర్ణ పతక పోరులో భారత్.. ఇరాన్, చైనీస్ తైపీ జట్ల మధ్య జరిగే మరో సెమీఫైనల్ విజేతతో తలపడనుంది. ఆసియా

క్రీడల కబడ్డీ చరిత్రలో 1--0 తో ఎడిషన్లలో ఇండియా ఫైనల్ చేరడం ఇది తొమ్మిదోసారి కావడం విశేషం. కాగా, 2018 జకార్తా గేమ్స్‌లో కాంస్యంతో సరిపెట్టుకోవడం మినహా ప్రతీసారి భారత్ ఫైనల్‌కు చేరుకుంది. ఈ టోర్నమెంట్‌లో కాంస్య పతక పోరు ఉండదని, సెమీఫైనల్స్‌లో ఓడిన రెండు జట్లు పోడియం స్థానాలను దక్కించుకుంటాయని నిర్వాహకులు తెలిపారు.

# నిఖిల్- తేజ అన్నదమ్ముల్లా ఒకే మార్గంలో!









టాలీవుడ్‌లో సరికొత్త కంటెంట్‌తో పాన్ - ఇండియా స్థాయిలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోలు నిఖిల్ సిద్ధార్థ్, తేజా సజ్జా. వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకుంటూ కాన్సెప్ట్ ఆధారిత చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద విజయం సాధించడంలో ఇద్దరి శైలి ఒకేలా కనిపిస్తుంది. వినూత్న ప్రయోగాలకు ప్రాధాన్యమిస్తూ, ఒకే రకమైన విజన్‌తో ప్రయాణిస్తున్న ఇద్దరు నటులు పరిశ్రమలో అన్నదమ్ముల్లా ఒకే బాటలో పయనిస్తున్నారనే అభిప్రాయం విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది.

-కార్తికేయ 2- చిత్రంతో జాతీయ స్థాయిలో అద్భుత విజయాన్ని అందుకున్న నిఖిల్ తదుపరి ప్రాజెక్ట్‌లను కూడా అదే స్థాయిలో ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రయోగాత్మక కథలను ఎంచుకుంటూనే సాంస్కృతిక, చారిత్రక అంశాలకు ప్రాధాన్యమిచ్చే భారీ చిత్రాలలో నటిస్తున్నారు. ఆయన లైనప్‌లో ప్రస్తుతం -స్వయంభూ- పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటోంది. వీటితో పాటు చారిత్రక ప్రాధాన్యత ఉన్న -ది ఇండియా హౌస్- అనే మరో పాన్ -ఇండియా చిత్రం లైన్లో ఉంది. తిరుగులేని బ్లాక్‌బస్టర్ అందించిన ఫ్రాంచైజీలో రాబోతున్న -కార్తికేయ 3- పనులు జరుగుతున్నాయి.

మరోవైపు చైల్డ్ ఆర్టిస్ట్‌గా పరిశ్రమలోకి వచ్చి -హను-మాన్- చిత్రంతో పాన్ ఇండియాలో క్రేజ్ సంపాదించుకున్నారు తేజా సజ్జా. ఫాంటసీ, మైథాలజీ, గ్రాఫికల్ విజువల్స్‌తో కూడిన కథలను నమ్ముకుంటూ తనకంటూ ప్రత్యేక మార్గాన్ని సుగమం చేసుకున్నారు. ప్రస్తుతం తేజ నటిస్తోన్న -మిరాయి2- చిత్రం సూపర్ హీరో యాక్షన్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతుండగా .. -జాంబీ రెడ్డి- సీక్వెల్ గా -జాంబీ రెడ్డి 2- పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి.

ఇలా ఇద్దరి లైనప్‌లను గమనిస్తే కొన్ని ఆసక్తికరమైన సమానత్వాలు కనిపిస్తాయి. ఇద్దరూ రొటీన్ కమర్షియల్ ఫార్మాట్లకు దూరంగా ఉంటున్నారు. విజువల్స్‌కు ప్రాధాన్యత ఉన్న కాన్సెప్ట్‌లకే జై కొడుతున్నారు. ఒకరికి కార్తికేయ సిరీస్ ఎలాగైతే గ్లోబల్ గుర్తింపు తెచ్చిపెట్టిందో? మరొకరికి -హను-మాన్- క్రేజ్ తెచ్చింది. మైథాలజీ, హిస్టరీ, అడ్వెంచర్ ఎలిమెంట్స్ మిళితం చేసిన కథలను

ఎంచుకోవడంలో నిఖిల్, తేజలు ఒకే మైండ్‌సెట్‌తో ముందుకెళ్తున్నారు. ఈ రకమైన కంటెంట్ ఓరియెంటెడ్ ఎంపికలు టాలీవుడ్ స్థాయిని అంతర్జాతీయ వేదికపైకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. కేవలం ప్రాంతీయ మార్కెట్‌కే పరిమితం కాకుండా ఉత్తరాది ప్రేక్షకులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆకట్టుకునేలా ఇద్దరు సబ్జెక్ట్‌లను ఎంచుకుంటున్నారు. భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న సినిమాలు బాక్సాఫీస్ వద్ద సేఫ్ బెట్‌గా మారడమే కాకుండా యంగ్ జనరేషన్ హీరోలకు కొత్త దిశానిర్దేశం చేస్తున్నాయి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 4-79, Revenue Colony, Tammireddy Palem, Kottapeta Editor : Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A3664 , e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965